ఆదివారం
వార్త
12 నవంబరు, 2023



# మది మదిలో వెలుగు పూలు..



శంకర్ దర్శకత్వంలో ప్రస్తుతం రామ్‌చరణ్ కథానాయకుడుగా గేమ్ చేంజర్ సినిమా రాబోతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రం తర్వాత రామ్‌చరణ్ దర్శకుడు బుచ్చిబాబు సానాతో ఓ భారీ చిత్రం చేయబోతున్నాడు. ఈ సినిమాలో బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీకపూర్‌తో ఓ స్పెషల్ సాంగ్ చేయిస్తే బాగుంటుందని మేకర్స్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. జాన్వీకపూర్ ప్రస్తుతం

# స్పెషల్ సాంగ్‌లో జాన్వీకపూర్?

ఎన్టీఆర్ 'దేవర' సినిమాలో నటిస్తోంది. జాన్వీ ఇకనుంచి వరుసగా తెలుగు సినిమాలు చేయాలని ప్లాన్ చేస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలో రామ్‌చరణ్ పక్కన జాన్వీకపూర్ స్పెషల్ సాంగ్‌లో నటించడానికి ఒప్పుకుంటుందా? చూడాలి మరి. ఈ భారీ యాక్షన్ చిత్రంలో ఓ అతిథి పాత్ర కోసం బాలీవుడ్ స్టార్‌ను తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఆ స్టార్ ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ సినిమాలో విజయ్ సేతపతి విలన్‌గా నటించ నున్నట్లు వార్తలు వినిపించాయి. ఈ విషయంలో ఎంతవరకు నిజం వుందో చూడాలి.

తారాతీరం



సూపర్ స్టార్ మహేష్ బాబు, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌ల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న తాజా సినిమా 'గుంటూరు కారం' ప్రస్తుతం వేగంగా షూటింగు జరుపుకుంటోంది. ఈ సినిమాలో శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలుగా నటిస్తుండగా కీలక పాత్రల్లో రమ్యకృష్ణ, జగపతిబాబు, ప్రకాష్ రాజ్, సునీల్ మొదలైనవారు నటిస్తున్నారు.

# 'గుంటూరు కారం' జనవరిలో విడుదల

హారికా హాసినీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం 2024 జనవరిలో విడుదల కానుంది.

## సముద్రఖని, ధనరాజ్‌ల కొత్త చిత్రం

ప్రముఖ నటుడు సముద్రఖని ప్రధాన పాత్రలో కమెడియన్ ధనరాజ్ దర్శకత్వంలో కొత్త సినిమా రాబోతుంది. తండ్రీ, కొడుకుల ఎమోషన్‌తో ఎవరూ టచ్ చెయ్యని ఒక పాయింట్‌తో ఈ మూవీని డైరెక్ట్ చేస్తున్నాడు ధనరాజ్. 'విమానం' చిత్ర దర్శకుడు శివ ప్రసాద్ యానాల ఈ సినిమాకు కథ, మాటలు సమకూరుస్తున్నారు. సంగీత దర్శకుడు అరుణ్ చిలువేరు ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు.

ఆదివారం వార్త

12 నవంబరు, 2023

## మంచి ముత్యాలు

నాకేమైనా కొద్దిగా డబ్బు లభిస్తే ముందుగా పుస్తకాలు కొంటాను. ఆ తర్వాత రొట్టె, బట్టల విషయం ఆలోచిస్తాను. - ఎమర్సన్

## విషయ విశేషం


ఎడారిలో రత్నాలు... 4

'సంఘీ'భావం....5

హరిత బాణాసంచా ఆచరణీయం

కవర్ స్టోరీ..6

మది మదిలో

వెలుగు పూలు..

ఆదర్శవంతమైన వ్యవసాయం.10

ఈవారం కవిత్వం..12

ఇదే జీవితం!

దృఢమైన బంధాలకోసం....14

కథ.. 20

ఎండమావులు

సాహిత్యం..23

తెలుగు సాహిత్యంలో 'గురజాడ'దీప్తి

ఆసియాలో చారిత్రక నగరాలు...25

నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉండవచ్చా?...29

ఇంకా..

పుస్తక సమీక్ష

మొగ్గ

వారఫలం


వగైరా..వగైరా..


## తాజా వార్తలు

### దోమలకే వ్యాధి వస్తే!



ఏటా లక్షలాది మంది డెంగీ, ఎల్లో పీవర్, చికెన్‌గున్యా జికా వైరస్‌ల కారణంగా మరణిస్తున్నారు. ఇందుకు కారణం దోమలే అన్నది తెలిసిందే. వైద్యశాస్త్రం ఎంత అభివృద్ధి చెందినప్పటికీనీ వ్యాధుల్ని పూర్తిస్థాయిలో నిరోధించగలిగే యాంటీవైరల్ చికిత్సలూ టీకాలూ ఇంకా పూర్తిస్థాయిలో రాలేదనే చెప్పాలి. అందుకే వీటిని తగ్గించేందుకు మరో మార్గాన్ని కనుగొన్నారు జాన్ హాప్కిన్స్ బ్లూమ్‌బర్గ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు చెందిన పరిశీలకులు. అదేమంటే దోమ మనిషిని కుట్టి వైరస్‌ను శరీరంలోకి పంపించగానే జబ్బుపడుతున్నాడు. కానీ ఆ వైరస్‌ల వల్ల దోమలకు ఎందుకు జ్వరాలు సోకడం లేదు..అవెలా ఆరోగ్యంగా ఉండగలుగుతున్నాయి...అని పరిశోధించారట. అందులో భాగంగా ఈ వైరస్ లను వ్యాపింపజేస్తున్న ఈడెస్ ఈజెప్టి అనే దోమని క్షుణ్ణంగా పరిశీలించారట. లోపల వైరస్ ఉన్నప్పటికీ అది ఏమాత్రం నీరసించకుండా హాయిగా తింటూ తిరుగుతుందట. అందుకు కారణం వాటిల్లోని ఆర్గొనాటె-2 అనే ప్రొటీన్ అనీ దానివల్లే అవి వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొంటూ చురుకుగా తిరుగుతున్నా యని గుర్తించారు. దాంతో దానికి సంబంధించిన ఆ జన్యువును నిర్వీర్యం చేయగా అవి కూడా ఆ వైరస్‌ల కారణంగా జబ్బుపడి చనిపోతున్నాయట. దీనివల్ల ఆయా వ్యాధుల అడ్డుకట్ట వేయొచ్చనీ ఇదే పద్ధతిలో మలేరియా వ్యాప్తినీ అడ్డుకోవచ్చనీ భావిస్తున్నారు.




మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ఎడారిలో రత్నాలు

**అరబ్బుదేశాలలో ఎక్కడ చూసినా ఇసుక ఎడారులు తప్ప పచ్చటి నీడ ఉండదు. నీటిచుక్క ఉండదు. అక్కడి వేడికి మనరక్తం చెమట చుక్కలుగా కారిపోతుం టుంది. 1960 వరకు ఈ ఎడారి దేశాలలో జీవితం ఎంతో దుర్భరంగా ఉండేది. పెట్రోలు ప్రవాహం పడిన తరువాత వారి జీవితాలు బాగా మారిపోయింది.**



ఈ.ఎస్.మాధవన్

పెట్రోడాలర్లు వస్తున్నాయి కానీ మౌలిక సదుపాయాలు సరిగాలేవు. అప్పుడు వారి చూపు మనవారి మీదపడింది. అలాగే కేరళవాసులు విపరీతంగా ఎడారి దేశాలకి ఉద్యోగం వ్యాపారం చేయడానికి వలస వెళ్లారు. అరబ్బులు మనవారిని ముఖ్యంగా కేరళవాసులను విపరీతంగా నమ్మారు, నేడు గల్ఫ్ దేశాలలో కేరళీయులు లక్షలలో ఉన్నారు. అక్కడ మనవాళ్లు ఉద్యోగం, వ్యాపారం చేస్తూ కోట్లకు పడగలెత్తారు. వ్యాపార సామ్రాజ్యాలనే ప్రారంభించారు. గల్ఫ్‌దేశాలలో అన్ని రంగాలలోను మనవారు ఉన్నారు. ఆ దేశాల అభివృద్ధి మనవారి కష్టం కూడా ఉంది అనే విషయంలో సందేహం ఏమాత్రం లేదు. మరి అలాంటివారి గురించి తెలుసుకుందాం. యూసఫలీ ఎమ్‌ఏ అనే పేరు నరేంద్రమోడీ ప్రధానిగా మొదటిసారి గెలుపొందినపుడు మనదేశంలో వినపడ సాగింది. ఇతను గల్ఫ్‌దేశా లలో ప్రముఖ వ్యాపారవేత్త అయ్యాడు. పైగా గల్ఫ్ రాజ కుటుంబంలో విశిష్ట అతిథి కూడా. కేరళలో అతిచిన్న కుటుంబం



మేనమామ దగ్గర, గుజరాత్‌లో పచారీ కొట్టులో బాల్యం గడిపాడు. బాగా డబ్బు సంపాదించాలని కలలు కనేవాడు. మరో మేనమామ దుబాయ్‌లో పచారీకొట్టు నడిపేవాడు. 1973లో అక్కడికి చిన్న నౌకలో వెళ్లాడు. అక్కడి పరిస్థితి గమనించి చిన్నవాన్‌లో పచారీ సరుకులు వేసుకుని వినియోగదారుల వద్దకు వెళ్లి అందించసాగాడు. అలా ఆరంభమైన అతడి చిరువ్యాపారం నేడు పెద్దపెద్ద షాపింగ్‌మాల్స్‌ను ఏర్పాటే చేసేస్థాయికి ఎదిగారు యూసఫలీ. మేటి బిజినెస్ స్కూల్‌లో నేర్పించిన వ్యాపారపాఠాన్ని పరిశీలనతో ప్రవర్తించి లులూగ్రూప్ అనబడే పెద్ద వ్యాపార మహాసామ్రాజ్యాన్ని గల్ఫ్, యూరప్ దేశాలలో నెలకొల్పి, మిలియనర్‌గా మారారు. మనదేశాన్ని బానిసగా మార్చిన ఈస్ట్ ఇండియా కంపెనీని కొనుగోలు చేసాడు. తూర్పు పశ్చిమ ఆసియా దేశాలు యూరప్ దేశాలు, ఇప్పుడు మనదేశంలో కూడా పెట్టుబడులు పెట్టి వ్యాపారాన్ని విరామం లేకుండా విస్తరిస్తూనే ఉన్నారు. యూసఫలీ, సూపర్ మార్కెట్‌లు, హైపట్‌మార్కెట్‌లు, మారియట్ వంటిస్టార్ హోటళ్లు, హాస్పిటలు, ఇలా ఎన్నోరంగాలలో ఉన్నారు. వీరు అందుకున్న పురస్కారాలకు కొదువలేదు. మనోహర్‌చాబ్రియా 1974లో జంబో గ్రూప్ అనే సంస్థని ప్రారంభించి

**(మిగతా 19వ పేజీలో)**

'సంఘీ' భావం



# హరిత బాణాసంచా ఆచరణీయం

సుమారు దశాబ్దకాలంగా దీపావళి పండగకు ముందు దాదాపు వారం పదిరోజుల నుంచి కాలుష్యం గురించి పలువురు ప్రస్తావిం చడం, న్యాయస్థానాలు సైతం కొన్ని అభ్యంతరాలు చెప్పడం పరిపాటిగా మారింది. దీపావళి పండగ సమయంలో బాణాసంచ కాల్చడం వల్ల కాలుష్యం స్థాయి కొంతవరకు పెరగడం యదార్థం. అయితే కేవలం దీపావళి వల్లే కాలుష్యం పెరిగిందని కొందరు పదేపదే వ్యాఖ్యానాలు చేస్తుంటారు. గతంలో మూడు రోజుల పాటు పటాసులు కాల్చేవారు. ప్రస్తుతం మారుతున్న జీవన విధానం, ఆకాశాన్నింటుతున్న ధరల నేపథ్యంలో ఈ పండుగ ప్రస్తుతం కేవలం ఒక్కరోజుకే అదీ కొన్ని గంటలకే పరిమితం అయ్యింది. కాలుష్య, పర్యావరణ నిపుణులు తెలుపుతున్న వివరాల ప్రకారం సంవత్సరంలో దీపావళి వల్ల అదనంగా వచ్చే కాలుష్యం కేవలం 0.27 శాతం మాత్రమే. మిగిలిన సుమారు 99.7 శాతం కాలుష్యానికి అనేక కారణాలు ఉన్నాయి. వీటి గురించి పట్టించుకోని కొందరు పర్యావరణవేత్తలు, సెక్యూలర్‌లు దీపావళిని టార్గెట్ చేస్తున్నారని పలువురు హిందూవులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అయితే వాస్తవాలు పరిశీలిస్తే ప్రస్తుతం దీపా వళి సమయంలో కాలుస్తున్న పటాసుల వల్ల వాతావరణ కాలు ష్యంలో మార్పులు వస్తున్నాయనడంలో సందేహం లేదు. గతంలో పరిశ్రమలు, గృహాలు ఇంత పెద్ద సంఖ్యలో ఉండేవి కాదు కాబట్టి కాలుష్య ప్రమాదం కూడా తక్కువగానే ఉండేది. గతంలో కాల్చే బాణాసంచకు భిన్నంగా ప్రస్తుతం పటాసులు తయారు అవుతు న్నాయి. ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి అవుతున్న పటాసుల వల్ల కాలుష్య ప్రభావం అధికంగా ఉంటోంది. మరోపక్క గతంలో కేవలం పది నుంచి 20 రకాల పటాసులు మాత్రమే దొరికేవి, ప్రస్తుతం బాణాసంచ తయారీలో ఆధునీకత మేళవించడంతో 200కు పైగా కొత్తకొత్త పటాసులు అందుబాటులోకి వచ్చాయి. వీటితో పాటు కాలుష్యాన్ని పెంచే ప్రమాదాన్ని కూడా ఇవి మోసు కు వచ్చాయి. దీపావళి అందరికీ ఆనందాన్ని పంచేదిగా ఉండాలి. కాలుష్యం విషయంలో వస్తున్న అంశాల్లో కొంత వాస్తవం ఉంది, కాబట్టి దీపావళి జరుపుకోవడంలో కూడా కొన్ని జాగ్రత్తలు తీసు కుంటే ఇటు పర్యావరణానికి సహకరించడంతో పాటు విమర్శలకు దూరంగా ఉండే అవకాశం ఉంటుంది. సాధారణ బాణాసంచతో పోలిస్తే ఇవి 30 నుంచి 40 శాతం మేర తక్కువ కాలుష్యాన్ని వెదజల్లుతాయి. సాధారణ బాణసంచ కాల్చే సమయంలో 160 డెసిబుల్స్ మేర శబ్దం వస్తే హరిత బాణాసంచలో కేవలం వంద డెసిబుల్స్ మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల ఇటు వాయు,అటు శబ్ద కాలుష్యాన్ని నివారించే అవకాశం కలుగుతుంది. చిన్నచిన్న బాంబుల తయారీలో 33 శాతం అల్యూమినియం, 9 శాతం సల్ఫర్, 57 శాతం పోటాషియం నైట్రేట్ ఉపయోగిస్తారు. హరిత బాణాసంచలో ఈ రసాయనాల సమ్మేళనం చాలా తక్కువ స్థాయిలో ఉంటుంది. సేఫ్ వాటర్ రిలీజర్ విధానం వల్ల మరింత ప్రయోజనం కలుగుతుంది. పోటాషియం నైట్రేట్, సల్ఫర్ మోతాదు చాలా తక్కువగా ఉంటుంది. వీటిని కాల్చే సమయంలో నీటి ఆవిర్లు వెలువడుతాయి. దీనివల్ల గాలిలోకి ధూళి కణాలు, రసాయనాల ప్రభావం చాలా వరకు తగ్గిపోతుంది. అవి వ్యాప్తి చెందకుండా నీటి ఆవిర్లు ఎక్కడికక్కడ నిలువరిస్తాయి. దీనివల్ల వాతావరణ కాలుష్యం అతితక్కువ ప్రాంతానికి మాత్రమే పరిమితం అవుతాయి. మరోరకంవి సేఫ్ థర్మాటిక్ క్రాకర్స్. ఇందులో కూడా విషతుల్యమైన రసాయనాల వినియోగం చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. చాలా తక్కువగా సల్ఫర్ డైయాక్సైడ్, నైట్రోజన్ డైయాక్సైడ్‌లు విడుదల అవుతాయి. ఇక సేఫ్ మినిమమ్ అల్యూమినియం విధానంలో మరింత తక్కువగా ధూళి కణాలు వెలువడుతాయి. ఇందుకోసం అల్యూమినియంకు బదులుగా మేగ్నిషియంను వినియోగిస్తారు, కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రకారం గ్రీన్ క్రాకర్స్‌లో 30 శాతం తక్కువ ఉద్గారాలను విడుదల చేస్తున్నట్లు పరిశోధానాత్మకంగా వెల్లడి చేశారు. వీటిలో తక్కువ హానీకరమైన రసాయనాలను కలిగి ఉండడమే కాకుండా తక్కువ ప్రమాదకరమైనవని సర్వేలో వెల్లడైంది. గ్రీన్ క్రాకర్స్‌ను సిఎస్ఐఆర్ ప్రకారం సఫాల్, స్టార్, స్వాస్ అనే మూడు వర్గాల కింద విభజించారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఈసారి బాణాసంచ కొనుగోలు సమయంలో ఒకటికి రెండు దుకాణాలు తిరిగి హరిత బాణాసం చను కొనుగోలు చేయడానికి ప్రయత్నించాలి. హరిత బాణాసంచ పెట్టెలపై సిఎస్ఐఆర్ అని ముద్రించి ఉంటుంది. దీనితో పాటు గ్రీన్ ఫైర్ వర్క్స్ అన్న లోగోలు ఉంటాయి. ఈ పెట్టెలపై క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. దీనిని స్కాన్ చేస్తే అసలైనదా నకిలీదా అన్న విషయం అర్థం అవుతుంది. అంతేకాదు గ్రీన్ కాకర్స్ తయారీలో ఏ విధమైన రసాయనాలు ఉపయోగించారన్న విషయం కూడా తెలుస్తుంది. ఆన్‌లైన్‌లోను ఈ క్రాకర్స్ లభిస్తాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ గ్రీన్ కాకర్స్ లభిస్తాయి. క్రాకర్స్‌ను కేవలం రాత్రి 8 గంటల నుంచి పది గంటల వరకు మాత్రమే కాల్చేందుకు ప్రయత్నించాలి. అర్థరాత్రి వరకు కాల్చే విధానానికి స్వస్తి పలకాలి. తెలుగు రాష్ట్రాల్లో చిత్తూరు ఉమ్మడి జిల్లాలోను, అన్నమయ్య జిల్లాలోను కాలుష్యం ప్రభావం అధికంగా ఉంటోంది. హైదరాబాద్ వంటి నగరాల్లో వాహనాల సంఖ్య అత్యధికంగా ఉండటంతో ఇక్కడ కూడా కాలుష్యం అధికంగా ఉంటోంది. ఇతరులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఎక్కువ సంఖ్యలో దీపాలు వెలిగించి, హరిత బాణాసంచను ఉపయోగించడం ద్వారా ఆనంద దీపావళిని జరుపుకోవడానికి ప్రయత్నించాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ



# మది మదిలో వెలుగు పూలు..

భారతీయులు రకరకాల ఆచార సంప్రదాయాలతో పండుగలు జరుపుకుంటారు. ఎన్నో మతాలవారు ఉన్నప్పటికీ భిన్నత్వంలో ఏకత్వం భారతీయత. తరతరాల నుండి వస్తున్న పండుగలకు ఒక ప్రత్యేకత, విశిష్టత ఉందని చెప్పవచ్చు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలతోపాటు, సామూహిక భాగస్వామ్యాలకు, ఐక్యతకు ప్రతీకలు.

కవర్ స్టోరీ

డా॥ ఓరుగంటి సరస్వతి

పండుగలు తరతరాల నుండి నేటివరకు ఒకే ప్రత్యేకతను సంతరించే గుర్తులుగా ఉంటూ, ఆదేశ ప్రజల సంస్కృతి సంప్రదాయాలకు ఔన్నత్యానికి ఆలంబలంగా నిలుస్తున్నాయి. ఏ దేశచరిత్రకైనా గర్వకారణం దాని సంస్కృతి. సంస్కృతిని పరిరక్షించడం, పోషించడం భావితరాలకు అందివ్వడం అన్నది నిరంతరాయంగా జరుగవలసిన కార్యక్రమం. సంస్కృతి, సంప్రదాయాలకు పట్టుకొమ్మలుగా ఉండే ప్రతీ పండుగ వ్యక్తిలో, సమాజంలో ఉత్తమ సంస్కారాన్ని నింపుతుంది. అంతేకాకుండా సుఖసంతోషాలలో మనుషుల జీవితానికి మొత్తంగా చూస్తే జీవకోటికే పరిపూర్ణతను సిద్ధింప చేస్తుంది. భారతీయులు వారసత్వంగా ఎన్నో పండుగలను, సంస్కృతీ సంప్రదాయాలకు, సమైక్యతకు ప్రతిబింబాలుగా జరుపుకోవడం విశేషం. ఉగాది, ఏకాదశి, సంక్రాంతి, వినాయకచవితి, శ్రీరామనవమీ, దీపావళి, కృష్ణాష్టమి, శివరాత్రి, దసరా పండుగలు తెలుగువారి పండుగలు. ఇంకా క్రైస్తవులు క్రిస్మస్, గుడ్‌ఫ్రైడే, ఈస్టర్, ముస్లింలు రంజాన్, బక్రీద్, మొహర్రం మొదలైన పండుగలు జరుపుకుంటారు. అన్ని పండుగలు కూడా ఒక సామూహిక వాతావరణాన్ని తలపించే పండుగలే. సంతోషాలకు గుర్తులుగా, కష్టాల్ని, శ్రమల్ని మర్చిపోయి, ఆనందంగా మన అనుకునే అందరితో కలిసిమెలిసి జరుపుకొనేవి పండుగలు. అన్ని పండుగల్లోనూ ఇలాంటి నేపథ్యం ఉండడం విశేషం. సందర్భం ఏదైనా అందరూ సంతోషంగా ఉంటే పండుగ వాతావరణంలా ఉంది అంటారు. అదీ పండుగలలోని మర్మం. అన్నిరోజుల అలసట, కష్టం, బాధ, దుఃఖం అన్నీ విడనాడి సంతోషంగా జరుపుకునే ప్రతీవేదుక ఒక పండుగ వాతావరణమే. ఆయాపండుగల సందర్భంగా ప్రజలు కొత్తబట్టలు ధరించి, పిండివంటకాలు, వివిధ రకాలైన ముఖ్యంగా ప్రత్యేకమైన వంటకాలను తయారు చేసుకోని ఒకరితో ఒకరు తమ ఆనందాల్ని పంచుకుంటారు. హిందువులు సంక్రాంతి పండుగను ముగ్గులువేసి గొబ్బెమ్మలు పెట్టడం, ప్రత్యేకత, పంటలు చేతికొచ్చినప్పుడు జరుపుకునే ఈ పండుగను భోగి, సంక్రాంతి, కనుమలుగా మూడురోజులు జరుపుకోవడం ఆనవాయితీ. భోగిరోజు భోగిమంటలు వేయడంతోపాటు, చిన్నపిల్లలకు భోగిపళ్ళు పోస్తారు. మూడోరోజు కనుమ. అలాగే ఉగాది పండుగ. తెలుగు సంవత్సరాది. తీపి, పులుపు, కారం, చేదుల మిశ్రమంగా ఉగాది పచ్చడి చేసుకొని తింటారు. జీవితంలో ఉండే సుఖదుఃఖాలకు ఉగాది పచ్చడిని ప్రతీకగా భావించడం ఈ పండుగ విశేషం. అలాగే అశ్వయాజమాసంలో వచ్చే అతిపెద్ద పండుగ దసరా. శరన్నవరాత్రులు, జమ్మిచెట్టును, పాలపిట్టను దర్శించడం, విజయానికి సూచన. ఇలా ఎన్నో పండుగలు మంచికి, చెడుకి మధ్య జరిగే ప్రస్థానంలో మంచిని, గెలుపుని సూచిస్తూ, ఆనందోత్సాహాలతో,

విజయానికి గుర్తుగా జరుపుకుంటారు. అంతేకాకుండా క్రైస్తవులు, పండుగలు, ముస్లింల పండుగలు ఆయామతాల ప్రత్యేక సాంప్రదాయాల ప్రకారం జరుపుకుంటారు. ఇలా ఎన్నో పండుగలు సమైక్యతకు చిహ్నంగా జరుపబడుతూ దేనికదే ప్రత్యేతకతను సంతరించుకునేవి. ఆవిధంగానే జరుపుకునే తెలుగువారి మరొక ముఖ్యమైన వెలుగు జిలుగుల తారాజువ్వల పండుగ దీపావళి. ఈ పండుగను మనం ఈనెలలో జరుపుకుంటున్నాం కాబట్టి ఆ పండుగ ప్రాశస్త్యాన్ని కొంత పరికిద్దాం..

దీపావళి పండుగ ప్రతీసంవత్సరం చతుర్ధశి, అమావాస్యలలో వచ్చేపండుగ. అభ్యంగనస్నానం, దీపాల వరుసలతో, లక్ష్మీపూజ చేయడం ఈ పండుగ ప్రత్యేకత. దీపావళి అనగా దీపాలవరుస అని అర్థం. హిందూ సంప్రదాయం ప్రకారం దీపానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దీపం కాంతిని వెదజల్లే విజ్ఞానజ్యోతి. దీపావళి పండుగనాటి అమావాస్య చీకటిని తరిమేసి ప్రకాశవంతమైన వెలుగును ప్రసాదిస్తాయి.

**'దీపజ్యోతిః పరబ్రహ్మం**
**దీపజ్యోతిర్జనార్దనంః!**
**దీపోహారతుమే పాపం**
**దీపజ్యోతిర్నమో స్తుతే..'**



శుభాలను కలిగించే దీపం విశిష్టత. అందుకే ఈ పండుగకు దీపాలశోభ సంతరింపు ప్రత్యేకతనే చెప్పాలి. ఆశ్వయుజ బహుళ అమావాస్యని దీపావళి అమావాస్యగా, ఆశ్వయుజ బహుళ చతుర్దశిని, నరకచతుర్దశని అంటారు. 'ఆశ్వయుజ చతుర్దశ్యాం సూర్యోదయాత్పురా
యామినీ పశ్చిమభాగే తైలాభ్యం గోవిధీయతే!!' దీపావళి పండుగనాడు సూర్యోదయానికి ముందు తెల్లవారుజామున నువ్వుల నూనెతో అభ్యంగనస్నానం చేస్తారు. తర్వాత నువ్వులతో తిలోదకం వదులుతారు. ఎంతో విశిష్టతను సంతరించుకున్న దీపావళి పండుగకు సంబంధించి ఎన్నో కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి.

ముఖ్యంగా దీపావళి పండుగ అంటే మనకు శ్రీకృష్ణుడు, సత్యభామ గుర్తుకు వస్తారు. యమ త్రయోదశి, నరక చతుర్దశి, దీపావళి, అమావాస్య రోజుల్లో శ్రీకృష్ణుడు, సత్యభామలచే సంహరించబడిన నరకాసురుని వల్ల విముక్తులైన ప్రజలు ఆనందోత్సాహాలతో నాటి నుండి దీపావళిని వెలుగు జిలుగుల





దివ్వెలతో, ఆనందోత్సాహాలతో జరుపుకుంటారు. దీపావళి పండుగరోజు నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తారు. ఇంటిని చక్కగా దీపాలతో అలంకరిస్తారు. అంతేకాకుండా మహాలక్ష్మిని భక్తి శ్రద్ధలతో పూజిస్తారు.

సామాన్య ప్రజల నుండి కోట్లు గడించే వ్యక్తులు, వ్యాపారస్తులు, లక్ష్మీదేవిని భక్తిశ్రద్ధలతో అలంకరించుకొని పూజిస్తారు. ఆశ్వయుజ బహుళ త్రయోదశినే ధన త్రయోదశిగా జరుపుకుంటారు. ఆరోజు శుచీ శుభ్రత, భక్తి శ్రద్ధలతో, కొత్తగా కొనుగోలు చేసిన వెండి, బంగారు నగలను కూడా పూజలో పెడితే అష్టైశ్వర్యాలు సిద్ధిశ్వర్యాలు సిద్ధి స్తాయని నమ్మకం.

దీపావళిని జరుపుకునే రాత్రుల్లో పిల్లలు, పెద్దలు, పురుషులు, స్త్రీలు.. అందరూ టపాసులు కాలుస్తారు. ముఖ్యంగా పిల్లలు ఎంతో ఇష్టపడే పండుగ దీపావళి. రకరకాల మిఠాయిలు పిండివంకాలు సన్నిహితులకు పంచుకుంటూ, ఒకరికొకరు ఆనందోత్సాహాలతో బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు. పిల్లలు ఓ పక్క భయపడుతూనే మరోపక్క చిచ్చుబుడ్లు, కాకరవత్తులు, తారాజువ్వలు, వెలిగించాలన్న ఆరాటంతో ఉరకలు వేస్తూ, కుటుంబ పెద్దల సహాయంతో కాలుస్తారు.

దీపావళి పండుగ అంటేనే దివ్వెల (దీపాల) పండుగ. చీకటి బాధలకు, వెలుగు సంతోషానికి, విజయానికి ప్రతీకలని చెప్పవచ్చు. లక్ష్మీదేవికి ప్రతీకగా దీపాన్ని చెపుతూ– మరో కథనం ప్రకారం దుర్వాస మహాముని శాపం వల్ల ఇంద్రునికి కళ్లు కనిపించకుండా పోయాయని, దేవతలు, మునులు శ్రీ మహావిష్ణువును ప్రార్థించగా మహాలక్ష్మి లేకపోవడం వల్లే లోకాలన్నీ చీకటిమయమైనాయని, ఆమె పుట్టుకకోసం తపస్సు చేయాలని చెప్పగా అలాగే చేస్తారు. తత్ఫలితంగా శ్రీ మహాలక్ష్మి క్షీరసాగర మథన సమయంలో అవతరించిందని చెప్తారు. ఈ ఘటన అంతా కూడా ఆశ్వయుజ అమావాస్య నాటి రాత్రి జరిగి, లోకాలకు చీకటి పోయి, వెలుగు ప్రసాదించబడిందని కూడా అంటారు. ఆనాటి నుండి, ఆ అమావాస్యనాడు లక్ష్మీపూజలు మొదలై లక్ష్మీదేవి దీపానికి ప్రతీకగా నిలిచిందని కూడా చెప్పడం విశేషం. అంతేకాకుండా లంకలో రావణాసురుని సంహరించిన రాముడు సీతతో కలిసి అయోధ్యకు వచ్చినప్పుడు కూడా ఆనందోత్సాహాలతో ఆ రాజ్య ప్రజలు దీపావళి పండుగను జరుపుకున్నారని మరో కథనం.

దీపావళి పండుగ అంటేనే ఆబాలగోపాలన్ని అలరించే పండుగ. దీపావళి పండుగశోభ రాత్రి సమయంలోనే వెల్లివిరుస్తుంది. మట్టి ప్రమిదల్లో నువ్వుల నూనెతో దీపాల్ని వెలిగించి, చక్కగా అలంకరించడమే ఈ పండుగ ప్రత్యేకత. దీపకాంతులను వెదజల్లే ఈ దీపాల పండుగకు బంధువులు, స్నేహితులు, చిన్నా, పెద్దా ఒక చోట చేరి సంతోషాల్ని పంచుకునే వేడుక, వేదిక.

రకరకాల మిఠాయిలు, వంటకాలు, పిండివంటకాలు, ఒక ప్రత్యేకమైన, ఆనందకరమైన వాతావరణం. దీపాల వెలుగులను విరజిమ్ముతూ ఇంటి అందాలు, కొత్తబట్టలు వేసుకుని పిల్లలు, పెద్దల సందడి చెప్పనలవి కాదు.

ముఖ్యమైన విశేషం ఏమిటంటే బాణాసంచా కాల్చడం. ఈ వేడుక దీపాలు అలంకరించాక ఇంటి ముందు చిచ్చుబుడ్ల వెలుగులు, టపాసుల టపటపలు, కాకరొత్తుల వెలుగు జిలుగులు... ఇవన్నీ పండుగను పదింతలు రెట్టింపు చేసే ఆనందాలు. ఇలా టపాసులు కాల్చడం వెనుక ఒక నమ్మకం ఉంది. అదేమిటంటే ఆ బాణాసంచా వెలుగులు, శబ్దాలు, ప్రజల బాధల్ని, దుఃఖాన్ని తరిమివేయబడి లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందన్న ఒక నమ్మకం. అంతేకాకుండా ఆ సీజన్‌కి తగ్గట్టుగా ఏర్పడే తేమకు పుట్టే క్రిమికీటకాలు ఈ బాణాసంచా పొగకి నశిస్తాయని అంటారు.



అన్ని పండుగులు ఒక్కో ప్రత్యేకతను, సంస్కృతిని సంతరించుకున్నవే. ఉగాదికి ఉగాదిపచ్చడి, వినాయకచవితి నవరాత్రులు, దసరా శరన్నవరాత్రులు, బతుకమ్మ కోలాటాలు, సంక్రాంతి గొబ్బెమ్మలు, పాడిపంటలు ఇంటికి వచ్చిన సంతోషం. అలాగే దీపావళికి ప్రత్యేకంగా దీపాల్ని వెలిగించి ఆ వెలుగులో పండుగ అంటే అవీ ప్రత్యేకతే కదా! మరొక విషయం.. ఆ దీపం పితృదేవతలకు దారి చూపుతుందనే విశ్వాసం.



దీపావళి పండుగ అందరి జీవితాల్లో వెలుగుల్ని నింపుతుందనే ఉత్సాహం ఉరకలు వేసే పర్వదినం. ముఖ్యంగా ఈ పండుగలో టపాసుల ప్రాధాన్యత సంతరించుకున్న పండుగ కాబట్టి. దీపాల వెలుగులో పిల్లలు, పెద్దలు కొంత జాగరూకత వహించడం అవసరం. పర్యావరణాన్ని దెబ్బతీసే విధంగా ఉండే కెమికల్స్ నిండిన టపాసులను వాడకుండా, ప్రకృతి సమతుల్యతను కాపాడే విధంగా జాగరూకత వహిస్తే మంచిది. ఎందుకంటే ఒకప్పుడు ఉన్నట్టుగా వాతావరణ సమతుల్యం లేదు. ఎంతో కాలుష్యాన్ని విడుదల చేస్తుంది. కాబట్టి నేటి వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని సహజంగా ఉపయోగించదగిన టపాసులను కాల్చడం అన్ని విధాలా శ్రేయస్కరం. అంటే రీసైకిల్ అయ్యే విధంగా ఉండే పాసులనే ఎంచుకుంటే మంచిది.



క్షణం తీరిక లేకుండా ఉన్న బిజీ జీవితాలలో, ఉమ్మడి కుటుంబాలు విచ్చిన్నమైన నేపథ్యంలో సాంప్రదాయ పద్ధతులు విడనాడవద్దు. మట్టి ప్రమిదలలో జాగరూకతతో దీపాలు వెలిగించుకోవాలి. అంతేకాకుండా చిన్న పిల్లలు చేతులతో టపాసులు కాల్చే సమయంలో పెద్దల సమక్షంలోనే దగ్గరుండి జాగ్రత్తలు చెప్పి, వారిని గమనిస్తుండాలి. వారిని ఒకరినే అలా వదిలివేయకూడదు. పక్కనే నీళ్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలి.

పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చే సమయంలో కాటన్ బట్టలు ధరించడం శ్రేయస్కరం. ఒంటి మీద నిప్పురవ్వలు పడకుండా జాగ్రత్తలు పాటిస్తూ టపాసులు కాలిస్తే మంచిది. ముఖ్యంగా మహిళలు కాటన్ చీరెలు ధరించి (క్రాకర్స్ కాల్చి) దీపావళిని ఆనందమయంగా జరుపుకోవాలి.

ముఖ్యంగా పిల్లలు, పెద్దలు కంటికి దగ్గరగా టపాసులను పెట్టుకొని కాల్చడం మంచిది కాదు. భారీ శబ్దాల్ని ప్రేరేపించే వాటిని, వాతావరణానికి హాని కలిగించే వాటిని వాడకుండా వాతావరణ సమతుల్యానికి అనుగుణంగా ఉండే వాటిని కాల్చడం ఉత్తమం. కాలం మారినా, తరాలు మారినా సంస్కృతి సాంప్రదాయాల్ని జాగరూకతతో కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది. విభిన్న సంస్కృతులకు నిలయమైన భారతదేశంలో ఏ పండుగ విశిష్టత ఆ పండుగదే. తగిన జాగ్రత్తలు పాటిస్తూ సుఖ సంతోషాలతో చక్కని వెలుగులు విరజిమ్మే దీపావళిని ఆనందాయకంగా జరుపుకోవాలి. విజయోత్సాహాలతో, ఆయురైశ్వర్యాలతో అందరికీ శుభం కలగాలి అని కోరుకుంటూ ఈ దీపావళి పర్వదినాన అందరికీ దీపావళి శుభాకాంక్షలు.





# విలువైన బ్యాగులు



ఆభరణాల్లో మాత్రమే కనిపించే వెండి, బంగారు మెరుపులు ఇప్పుడు హ్యాండ్ బ్యాగుల్లోకి చేరిపోయాయి. గోల్డ్, సిల్వర్ లోహాలతో విభిన్న రకాల హ్యాండ్ బ్యాగులు మార్కెట్లో లభిస్తున్నాయి. విలువైన వస్తువులు, డబ్బులూ పెట్టుకోవడానికే ఒకప్పుడు హ్యాండ్ బ్యాగులు వాడేవారు. కాలక్రమంలో అది ఓ ఫ్యాషన్‌గా మారిపోయింది. ఫ్యాషన్ డిజైనర్లు ఎప్పటికప్పుడు సరి కొత్త మోడళ్ల హ్యాండ్ బ్యాగ్‌లను తయారు చేస్తున్నారు. అన్ని రకాల వేడుకలకు తగినట్లు వీటిని వైవిధ్యంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ బ్యాగుల్ని **14,18** క్యారెట్ల బంగారంతో ముత్యాలు, రాళ్లు చేర్చి ముచ్చట గొలిపేలా తయారు చేస్తున్నారు. స్టెర్లింగ్, యాంటిక్ సిల్వర్‌లతో వెండి బ్యాగులు లభిస్తున్నాయి. వేడుకల్లో గిఫ్టుగా ఇవ్వడానికి బాగుంటాయి.







ఉత్తరం నుంచి దక్షిణానికి 300 కి.మీ.లు తూర్పు నుంచి పడమరకు..260 అంటే ఒక్కరోజులో దేశాన్ని నాలుగు దిక్కులూ చుట్టి రావచ్చన్నమాట. జనాభా అంతా కలిసి కోటీ 75 లక్షలు. ఇంత చిన్న దేశం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ప్రపంచంలోనే రెండోస్థానంలో ఉంది. గుడ్లూ మాంసం ఎగుమతుల్లో యూరప్‌లో ప్రథమస్థానం. అదెలా సాధ్యమైందో తెలుసుకుందాం.



# ఆదర్శవంతమైన వ్యవసాయం

ఒక చిన్న పక్షి సముద్రతీరంలో గొయ్యి తవ్వి గుడ్లు పెట్టింది. అది ఆహారం కోసం బయటకు వెళ్లినప్పుడు పెద్ద అల వచ్చి ఆ గుడ్లను సముద్రంలోకి లాగేసింది. తిరిగొచ్చిన పక్షి గుడ్లు లేకపోవడం చూసి చాలా బాధపడింది. వరసగా కొన్నాళ్లపాటు అది గుడ్లు పెట్టడం అలలొచ్చి వాటిని తీసుకెళ్లిపోవడం జరిగేసరికి పక్షికి సముద్రం మీద పట్టలేని కోపం వచ్చింది. సముద్రాన్ని పూడ్చేయాలనుకుంది. భాగస్వామితో కలిసి రంగంలోకి దిగింది. నీటిలో మునిగి వచ్చి ఒడ్డున మట్టిలో దొర్లడం, ఒంటినిండా అంటిన మట్టితో మళ్లీ సముద్రంలో మునగడం అలా మట్టిని నీటిలో వేస్తూ సముద్రాన్ని పూడ్చేసే ప్రయత్నంలో పడ్డాయి రెండూ. వాటి బాధను అర్థం చేసుకున్న మిగతా పక్షులూ సాయం వచ్చాయి. అలా పక్షులన్నీ తిండీతిప్పలూ మానేసి సముద్రాన్ని పూడ్చే పనిలో పడ్డ విషయం పక్షుల రాజైన గరత్మంతుడికి తెలిసింది. కోపం వచ్చి సముద్రాన్ని అల్లకల్లోలనం చేసేశాడు. దాంతో గబగడా పైకివచ్చిన సముద్రుడు పక్షుల కోపానికి కారణం తెలుసుకుని, క్షమాపణ చెప్పాడు. తన గర్భంలో ఉన్న ఆ పక్షి గుడ్లన్నిటినీ భద్రంగా తెచ్చి ఇచ్చాడు. వాటిని చూసి పక్షులు శాంతించాయి. ఇటు పక్షి లోకాన్నీ అటు సముద్రాన్నీ కూడా కదిలించిన ఆ చిన్ని పక్షి కథని సంకల్పబలానికి ఉదాహరణగా చెబుతుంటారు. నెదర్లాండ్స్‌ని చూస్తే ఈ కథ గుర్తొస్తుంది. ఆ పక్షిలాగే నెదర్లాండ్స్ కూడా చాలా చిన్నది. పైగా చాలాభాగం లోతట్టు ప్రాంతం. పెద్దపెద్ద గాలిమరలతో బురదనేలల్ని ఆరబెట్టుకుంటూ నిజానికి అక్కడ వ్యవసాయం చేయడమే గొప్ప. కానీ నెదర్లాండ్స్ సాగులో స్వావలంబనతో సరిపెట్టుకోలేదు. పండుతున్న పంటలో ఎనభైశాతానికి పైగా ఎగుమతి చేస్తోంది. జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లండ్, బెల్జియం, కెనడా, మధ్యప్రాచ్య దేశాలు, ఆఫ్రికా తదితర దేశాలకు టొమాటో బంగాళాదుంపలూ ఉల్లిపాయలూ లాంటి కూరగాయలూ, అలంకరణకు వాడే పువ్వులూ, మొక్కలూ, పాల ఉత్పత్తులూ, గుడ్లూ, మాంసమూ ఎగుమతి చేసి ఏటా లక్షల కోట్ల రూపాయల్ని సంపాదిస్తోంది. దాంతో, ఎప్పుడూ వర్షాకాలంలా ఉండే ఈ చిన్న దేశం ఉన్నట్టుండి ఇలా 'సిలికాన్ వ్యాలీ ఆఫ్ అగ్రికల్చర్'లాగా ఎలా తయారైందీ అని ప్రపంచం ఆశ్చర్యంగా చూస్తోంది.



**గోల్డెన్ ట్రయాంగిల్:**

దేశాలన్నీ తమ అవసరాల కోసం పనిచేస్తోంటే నెదర్లాండ్స్ మాత్రం కొన్ని దశాబ్దాలుగా ప్రపంచ అవసరాలను దృష్టిలో పెట్టుకుని పనిచేయడం మొదలెట్టింది. 2050 నాటికి పెరిగే ప్రపంచ జనాభా ఆకలి తీరాలంటే ఇప్పటికన్నా ఇంకో 56శాతం ఎక్కువ ఆహారపదార్థాలు



కావాలి. అలాగని సాగుకి అందుబాటులో ఉన్న నేల ఏమాత్రం పెరగదు. మరి దిగుబడి పెంచడం ఎలా? ఈ ప్రశ్నని నెదర్లాండ్స్ వందేళ్ల క్రితమే వేసుకుంది. రెండు ప్రపంచ యుద్ధాలూ ఆ దేశాన్ని అతలాకుతలం చేశాయి. రెండో ప్రపంచయుద్ధం తర్వాత వచ్చిన కరవు వల్ల దాదాపు ఇరవై రెండువేల మంది చనిపోయారు. మరోసారి అలాంటి కరవు రాకూడదనీ, ఆహార ఉత్పత్తిలో మిగులు సాధించాలనీ సంకల్పం చెప్పుకున్న ఆ దేశం లక్ష్యసాధన దిశగా చేసిన కృషే ఇప్పుడు దాన్ని ప్రపంచపటంలో సమున్నతంగా నిలబెట్టింది. సాగులో సృజనాత్మక విధానాలకు శ్రీకారం చుట్టింది డచ్ నేల. అందుకుగాను రైతులతోపాటు ప్రభుత్వమూ, వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధకులూ కలిసికట్టుగా కృషి చేశారు. ఈ మూడు విభాగాలనూ కలిపి అక్కడ 'గోల్డెన్ ట్రయాంగిల్' అని పిలుచుకుంటారు. పరిశోధన ఫలితాలనెప్పటికప్పుడు ఆచరణలోకి తేవడం, సాంకేతికతను ఎక్కువగా వినియోగించకపోవడం, ఆధునిక యంత్రాల వాడకం సాగులో ప్రధాన విషయాలు అయ్యాయి. సారవంతమైన డెల్టా నేలనే అయినప్పటికీ వాతావరణం ఏమాత్రం సహకరించని పరిస్థితి కాబట్టి గ్రీన్‌హౌస్‌లలో కూరగాయల్ని పండించడం అక్కడ చాలాఏళ్ల క్రితమే మొదలెట్టారు. తమ అవసరాలతోపాటు ప్రపంచంలో వస్తున్న మార్పుల్నీ గమనిస్తున్న అక్కడి ప్రభుత్వం అవకాశాల్ని అందిపుచ్చుకోవడానికి సాగుని ఒక పరిశ్రమగా మార్చేసింది. పెరుగుతున్న జనాభాకి చాలినంత ఆహారాన్ని సరఫరా చేయాలన్న లక్ష్యం బాగానే ఉంది. కానీ వాతావరణ మార్పుల వల్ల పెరుగుతున్నాయి. కొత్త రకాల జబ్బులు వస్తున్నాయి. అతివృష్టి అనావృష్టి సందర్భాలు పెరుగుతు న్నాయి. వీటన్నిటినీ తట్టుకుని అంత ఆహారాన్ని పండించడం ఎలా సాధ్యం? అందుకే ఎక్కువ ఎకరాల్లో అని కాకుండా, ఎక్కువ దిగుబడి మీద దృష్టి పెట్టింది నెదర్లాండ్స్. 'సగం వనరులతోనే రెట్టింపు పంట పండించడం' అనేది డచ్ వ్యవసాయం నినాదంగా మారింది.

## పరిశోధనకు పెద్దపీట

నెదర్లాండ్స్‌లోని ఆమ్‌స్టర్‌డామ్ నగరానికి 85 కి.మీ దూరాన ఉన్న వాహ్‌నింగెన్ యూనివర్సిటీ అండ్ రీసెర్చ్ సెంటర్ వ్యవసాయానికి సంబంధించి ప్రపంచంలోనే నంబర్‌వన్ యూనివర్సిటీ అంటారు దీన్ని. ఆధునిక ఆహార ఉత్పత్తిలో సైన్సు చేస్తున్న అద్భుతాలను ఇక్కడ పరిశోధనలు జరుగుతున్నాయి. వివిధ దేశాలకు చెందిన ఎనిమిది వేలమంది ఆహార శాస్త్రవేత్తలు ఈ యూనివర్సిటీలో పరిశోధనలు చేస్తున్నారు. పేరొందిన పలు బహుళజాతి సంస్థలూ, కొత్తగా సృజనాత్మక ఆలోచనలతో వస్తున్న అంకురసంస్థలూ ఈ పరిశోధనలకు పెట్టుబడులు పెడుతున్నాయి. దానికితోడు ప్రపంచంలోని ఇరవై పెద్ద అగ్రిఫుడ్ వ్యాపార సంస్థల్లో 15 నెస్లె, యూనిలీవర్,




కార్గిల్, కోక-కోలా, క్రాఫ్ట్ హైంట్స్ లాంటివన్నీ తమ ప్రధాన పరిశోధన అభివృద్ధి కేంద్రాల్ని ఇక్కడే ఏర్పాటు చేసుకున్నాయి. ఐదేళ్ల క్రితమే '2030 ప్లాంట్ ప్రొటెక్షన్ విజన్'ని రాసుకుంది నెదర్లాండ్స్ ప్రభుత్వం. దాని ప్రకారం అధిక దిగుబడినిచ్చే కొత్త వంగడాల తయారీకీ, ప్రెసిషన్ ఫామింగ్‌కీ ప్రాధాన్యం ఇస్తోంది.

## కొత్తకొత్త వంగడాలు

కూరగాయలకీ ఆర్నమెంటల్ ప్లాంట్స్‌కీ విత్తనాల సరఫరాలో డచ్ కంపెనీలదే అగ్రస్థానం. దేశ వాయవ్య ప్రాంతాన్ని 'సీడ్ వ్యాలీ' అనీ అక్కడి ఉత్పత్తులను 'గ్రీన్ సాఫ్ట్‌వేర్' అని పిలుచుకుంటారు. యూనివర్సిటీ పరిశోధనలను మరో అడుగు ముందుకు తీసుకెళ్తూ ఇక్కడ పలు ప్రైవేట్ సంస్థల్లో కొత్త వంగడాల తయారీకి నిరంతరం పరిశోధన జరుగు తుంటుంది. ఉదాహరణకి ఎంజా జాడెన్ అనే కంపెనీ మూడు తరాల క్రితం ఒక చిన్న విత్తన దుకాణం. ఇప్పుడు 2500 మంది ఉద్యోగులతో 25 దేశాల్లో సబ్సిడియరీలను కలిగి ఉంది. ఈ సంస్థ ఏటా 850 కోట్లు పరిశోధనకు వెచ్చించింది. 150 రకాల కొత్త విత్తనాలను తయారు చేస్తుందట. ఇక్కడ ఉత్పత్తి చేసిన విత్తనాల నుంచే ఏటా 1200 కోట్ల టెట్యూస్‌లు పండుతున్నాయి. 1960ల నుంచీ ఈ కంపెనీ తయారు చేస్తూ వచ్చిన టొమాటో వంగడాలు కంపెనీకీ దాంతోపాటు నెదర్లాండ్స్‌నీ ప్రపంచ టొమాటో ఎగుమతుల మార్కెట్లో మొదటిస్థానంలో నిలబెట్టాయి. గుజ్జు ఎక్కువగా ఉండే పెద్ద టొమాటోలూ, రుచిగా ఉండే వైన్ టొమాటోలూ..ఇలా 15 టొమాటో వెరైటీలను ఈ సంస్థ అభివృద్ధి చేసింది. ఒక్క కంపెనీనే ఇంత చేస్తుంటే పదుల సంఖ్యలో ఉన్న కంపెనీల పరిశోధనలు ఇంకెన్నో. రకరకాల బీన్స్, బేబీ కేరట్స్ తయారు చేసే 'హాలెండ్ సెలెక్ట్' కంపెనీదేతే వందేళ్ల చరిత్ర. 'వాతావరణ మార్పుల గురించి మాట్లాడుకుంటూ వాటిని ఎదుర్కొనే పంటల గురించి ఆలోచించకపోతే ఎలా? అసలు వాతావరణ ప్రభావానికి మొట్టమొదట లోనయ్యేది పంటలే. వాటిని కాపాడుకోకపోతే ప్రపంచానికి తిండి ఎక్కడి నుంచి వస్తుంది. అందుకే నేలమీద, నీటిలో, ఆరుబయట, గ్రీన్‌హౌస్‌లో ఇలా వైవిధ్యభరితమైన వాతావరణాల్లో పండే వేర్వేరు పంటల గురించి పరిశోధనలు చేస్తున్నాం' అంటున్నాయి ఈ సంస్థలు. నెదర్లాండ్స్ వ్యవసాయంలో ముఖ్యమైన మరో విషయం 'ప్రిసిషన్ ఫామింగ్' మామూలుగా వ్యవసాయం చేసేవారు ఎరువుల్నీ క్రిమి సంహారకాల్నీ పొలమంతా చల్లడం సహజం. ఇక్కడలా కాదు. ఏ మొక్కకి ఏది అవసరమో అది మాత్రమే తగుపాళ్లలో అందేలా చూస్తారు. ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. నెదర్లాండ్స్‌లో నదులూ ఎక్కువే. దాంతో మంచి సారవంతమైన ఎల్టా నేలలున్నాయి. అక్కడ గోధుమ, మొక్కజొన్న, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు పండిస్తూ పూలు ఆకుకూరలూ కూరగాయలూ లాంటి వాటిని గ్రీన్ హౌసుల్లోనే పండిస్తున్నారు.





# ఇదే జీవితం!

**జీవితం**
వైకుంఠపాళి లాంటిది!
ఇక్కడ..
అగాథాలు వుంటాయి
మహోన్నత శిఖరాలు వుంటాయి!
అగాథం ఎదురు పడినప్పుడు
తట్టుకుని తమాయించుకుని... లేచి నిలబడి
బతుకు పయనం సరికొత్తగా ప్రారంభించాలి.
శిఖరం అంచులకి చేరుకున్నప్పుడు
సంబరంతో పొంగిపోకుండా
మరో ఎత్తు ఎక్కే ప్రయత్నం చేయాలి!
విజయాలు వరుసగా
అందుకునేలా మరింత శ్రమించాలి.
జీవితం..
ఆశ నిరాశల మధ్యన ఊగే లోలకం
వంటిది!?
నిరాశ దరి చేరి నిస్సహాయ స్థితికి
చేర్చినప్పుడు
కుంగిపోకుండా ధీమాగా నిలబడగలగాలి!
ఆశలు ఎన్నో హృదయంలో చిగురిస్తుంటే
ఉత్సాహంగా లక్ష్యం దిశగా పోరాడాలి!
ఏదైనా...
జీవితమంటే
ప్రతి నిత్యం నిన్ను నువ్వు తెలుసుకునే
నిన్ను నువ్వు తీర్చిదిద్దుకునే
నిన్ను నువ్వు గెలిపించుకునే.. రణరంగం!!
ప్రయత్నం
ఎలాంటి గాయాలనైనా మార్చి..
గెలుపు కెరటాలుగా మలిచే అద్భుతం!

**- గొర్రెపాటి శ్రీను**

## నా బంగారు తెలంగాణలో!

నెల చివరి రోజుల్లో
చుట్టాలొస్తున్నారని చిరుద్యోగి
ఇంటి పైన కాకి అరిచింది.
జీతాలు లేక
మూలిగే నక్క పైన
తాటిపండు పడినట్లు
చిరుద్యోగి గుండె మూలిగింది.
రాజ్యమేలుతూ రంగులు
మార్చే ఊసరవెల్లి
మరో లక్ష ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు
చిలుక పలుకులు పల్కింది.
పరవశించి మురిసి మైమరిచి
ప్రజా ఎలక
మళ్లీ బోనులో పడింది.
ఎలకలను మింగే పిల్లి రాజకీయం
చప్పట్లు కొట్టి, పొగిడి
ముసి ముసి నవ్వులు నవ్వింది.
చెడు అనవద్దు, చెడు వినవద్దు
చెడు కనవద్దు అనే నీతిని
మేధా(అ)వుల వర్గం పాటిస్తుంది.

**- ముక్కెర బలరాం**


## ఈవారం కవిత్వం

జీవనది ప్రవాహం స్వచ్ఛమే, నిర్మలమే
నదిలో ఎన్నో పాయలు,
ఎన్నో చీలికలు, ఎన్నో మలుపులు తిరిగి
రమ్యమై ప్రవహించే నది
కడకు లీనమయ్యేది సాగరంలోనే.
సాగరం నిశ్చలం/ నదీనదాలు అనిశ్చలం
చేతనత్వం నింపుకుని/ ప్రవహించే శక్తి స్వరూపిణినది.
పైరగాలులు స్వచ్ఛమయ్యేది
స్వచ్ఛమైన నీటితో
సస్యశ్యామలములై పండే
తరుణంలోనే/ విషవాయువుల లీనంతో
కలుషితం కాకుంటే/ గాలిమరి స్వచ్ఛమే,
నిర్మలమే.

**- యలమంచిలీ శివాజీ**



## చరిత్రకు సజీవ సాక్ష్యం




'కలాలు చెదరవు/నిజాయితీ కలాలు/ నిలదీస్తనే వుంటాయి/ విశ్వానికంతా భావాలను/ అందించే కలాలు/ ఆత్మహత్యలకు లొంగవు/ కలాలు ఎప్పటికీ సజీవమే' అంటున్న కవి మహమ్మద్ ఖాజామైనద్దీన్ తన అయిదవ గ్రంథంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖుల స్ఫూర్తిదాయక జీవితాలను రికార్డు చేసి పాఠకుల ముందుంచాడు. రాజకీయ, సాహిత్య, సామాజిక మున్నగు రంగాలలో విశేష కృషి గావించి అమరులైన చరితార్థుల జయంతి, వర్ధంతుల సందర్భంగా వారిపై కవితలు అల్లి అక్షరాంజలి సమర్పిస్తున్నాడు. చెరబండరాజు, రాయప్రోలు, దొడ్డికొమరయ్య, అల్లూరి, దాశరథి, గుర్రం జాషువా, సాహుమహరాజ్, అబ్దుల్‌కలాం, జయశంకర్, సర్వాయి పాపన్న, బి.పి.మండల్, మదర్‌థెరిస్సా, ఆరుద్ర, కాళోజీ, విశ్వనాథ యిలా ఎందరో కారణజన్ములను స్మరిస్తూ, నివాళులు అర్పిస్తూ, సమాజానికి వారొనరించిన సేవలను గుర్తుచేస్తు కవితలల్లారు. ప్రపంచ జనాభా దినోత్సవం, తల్లిదండ్రుల దినోత్సవం, మైత్రి దినోత్సవం, తల్లిపాల వారోత్సవం, చేనేత దినోత్సవం, అంతర్జాతీయ ఆదివాసుల మరియు యువజన, స్నేహితుల, మానవ దినోత్సవం వంటి చారిత్రాత్మక అంశాల ప్రాశస్త్యాన్ని విపులీకరిస్తు కవితలల్లి భావితరాలకు రికార్డుగా అందించారు.

**(కలాలు సజీవమే, రచన: మహమ్మద్ ఖాజామైనద్దీన్, వెల: రూ 50, ప్రతులకు: నవ తెలంగాణ బుక్‌హౌస్, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్)**

– రమణ వెలమకన్ని

## ఆలోచన రేపే 'కడుపాత్రం' కథలు



రచయిత ఈ కథాసంపుటిని తన అమ్మ-నాన్నలకు అంకితం చేసారు. కీ.శే.శ.గంగమ్మ, (కీ.శే.ఓబులరెడ్డి) ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి, చక్కటి ముందుమాట రాసారు. రచయిత భాషోద్యమం, రైతు ఉద్యమం, పాత్రికేయులుగా, గ్రామీణ దళితవాడల్లోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసిన అనుభవం ఉండటంతో పల్లెజీవనాన్ని కథల్లో అక్షరీకరించారు. రాసి, వాసి, చూడాలి. వీరి కథల్లోంచి పాఠిక కథలే రాసిన జీవనఘర్షణ అనేక సామాజికాంశాల్ని సృజించడం ఆలోచింపజేస్తుంది. సాంస్కృతిక విధ్వంసాన్ని, రైతుల బాధలు, గిట్టుబాటుకాని, నిలకడలేని ధరలు శిధిలమైన గ్రామీణ జీవనం వస్తువులుగా ఈ కథలన్నీ ఉన్నాయి. కేతు విశ్వనాథరెడ్డి అన్నట్లు పర్యావరణ సాహిత్యం వాతావరణ సంక్షోభసాహిత్యం ఈ కథల్లో కనిపిస్తాయి. 'కడుపాత్రం' కథపై 'విహారి' సమీక్షావ్యాసం రాసారు చివర (పేజీ 151). చక్రాల పల్లెకు తోలుబొమ్మలాట ఆడించే వెంకటరావు వస్తాడు. ఆగ్రామ పెద్ద రామగోవిందరెడ్డి ఆదరణ వుండేది. ఒకప్పుడు అతని కొడుకు చిన్నారెడ్డికి కళాదరణ తక్కువ. అంతరిస్తున్న మన జానపద కళాసంస్కృతిని చక్కగా చెప్పారు రచయిత. అన్ని కథలూ బాగున్నాయి. **(కడుపాత్రం, రచన: తవ్వా ఓబుల్‌రెడ్డి, వెల: రూ 150, ప్రతులు: టి.పార్వతి, 13-584-2, మైదుకూరు, కడపజిల్లా)**

– తంగిరాల చక్రవర్తి

**పుస్తక సమీక్ష**

## సత్యదర్శనం-డా॥సమ్మన్న ఈటెల

ఎదపూదోటని వసంత సమీరంలో స్పృశించే, జీవన మోహనరాగమై పల్లవించే, అంతరంగ వేదికపై సత్యాన్ని ఆవిష్కరించే అనిర్వచనీయ, భగవత్ చైతన్యాన్ని దర్శించాలనే చింతతో 'డా॥సమ్మన్న ఈటెల', కవిత్వాన్ని ధారావాహికగా, కవిగా సంకలనాలు వెలువరిస్తున్నారు. సత్యదర్శనంలోని 43 కవితా ఖండికలలో, పరమాత్మతత్వాన్ని తెలుసుకోవాలనే ఆర్తి, చింతన,



అంతర్నేత్ర జిజ్ఞాస తెలుగు చదువరులకే అంతగా పరిచయం లేనిది. అనువాద సాహిత్యంలో కొంత వరకు ప్రయత్నం కొనసాగుతున్నా, కృతకమైన భాష కారణంగా భావమార్మికత, లోతుల్ని తరచి చూసే అవగాహన లోపిస్తోంది. డా॥సమ్మన్న జీవితానుభవాల దృష్ట్యా, కవిగా అనూహ్యరీతిలో తన కవితా ప్రస్థానంలో అలౌకిక మానసిక పరిపక్వతతో సత్యదర్శనాభిలాషిగా ముందుకు సాగుతున్నారు. ఎందరో ఋషులు, యోగులు, తాపసులు, వేదాంత జిజ్ఞాసువులకు ఎండమావిగా సాక్షాత్కరించి మాయమవుతున్న ఈ దివ్యపార మార్మికతత్వాన్ని ఒక మానవతావాదిగా, ఉదారవాదిగా, దీనజనుల జీవితాలలో వెలుగు నింపే వేడుకోలుతో కొనసాగించడం జీవన కృతకృత్యత సాధింపచేస్తోంది. సమాజంలో వ్యథ, వేదన, బాధలు సాధ్యమైనంతగా తొలగించే సేవామార్గమే, భగవదారాధనగా జీవించే వ్యక్తిత్వం వున్న డా॥సమ్మన్న ఎందరికో మార్గదర్శిగా జీవన సాఫల్యత సాధిస్తున్నారు. అభినందనీయులు. **(సత్య దర్శనం, రచన: డా॥సమ్మన్న, వెల: రూ 100, ప్రతులు: 207, సిరిరెసిడెన్సీ, వీధినం. 2, తార్నక, హైదరాబాద్-17) – యర్రమిల్లి**

ప్రఖ్యాతకవి సుధామ వాట్సప్‌లో నడిపించే 'ఓసారి చూడండి..అంతే' అనే వాట్సప్‌గ్రూప్ నిర్వహించిన కథల పోటీలో ఎంపికైన కథల సంకలనం 'ఓసారి చూడండి..అంతే' అనే కథల పుస్తకం. ఈ పుస్తకంలో మొత్తం 30

## చదివించే మంచి కథలు



కథలున్నాయి. ద్విభాష్యం రాజరాజేశ్వరరావు, పి.వి.శేషారత్నం వంటి సీనియర్ రచయితలతోపాటు యాళ్లరాజేష్, దేశరాజు వంటి అనుభవజ్ఞులైన రచయితల కథలు ఈ సంకలనంలో ఉన్నాయి.

ఈ కథలన్నీ పరిమిత నిడివిలో ఒదిగి సృజించిన కథలు కాబట్టి, కథలు వేగంగా చదివిస్తాయి. కథలలో వస్తువులు విభిన్నమైనవి. సీరియస్ కథలు, హాస్యకథలు, వ్యంగ్యకథలు, నీతికథలు వంటి పలు రకాల కథలున్నాయి సంకలనంలో. అయితే వాట్సప్ కథలు కావటంతో కథల నిడివి తక్కువ కావటంతో కథల పరిచయం చిన్నది. ఒక చిన్న సంఘటనను కథగా మలచటం కనిపిస్తుంది. అందువల్ల కథలు చకచకా చదవగలుగుతాయి. కథాంశం వల్ల కథలను గుర్తుంచుకోగలుగుతోంది.

**(ఓ సారి చూడండి..అంతే! కథామాలిక, కూర్పు: విహారి, సమర్పణ: సుధామ, వెల: రూ 200, ప్రతులకు: సుధామ, ఇ-107, గోల్డెన్‌మైల్ రోడ్, కొత్తపేట్, హైదరాబాద్)**

– నిర్మోహి



# దృఢమైన బంధాలకోసం..

అయ్యల సోమయాజుల సుబ్రహ్మణ్యము

స్త్రీ పురుష ప్రకృతులు శృంగార సంఘర్షణలతోనే సృష్టి మొత్తం ప్రభవిస్తుంది. చివరకు లయిస్తుంది. తిరిగి సరికొత్తగా చిగురిస్తుంది. ఆనందిస్తుంది. నశిస్తుంది. ఇది సృష్టి చక్రభ్రమణం సూత్రం. అనాదిగా సకల జీవరాశుల మధ్య ఈ తంతు సజావుగా సాగిపోతూ వచ్చింది. మానవజాతి దగ్గరకు వచ్చే సరికి-ఆకర్షణ, లాలన క్రమంగా వక్రమార్గం పట్టాయి. వావీ-వరస, సమయం- సందర్భం, ఉచితం, అనుచితం, ఇష్టాయిష్టాల మధ్య విభజన రేఖ చెరిగిపోయింది. కట్టడి అవసరమైంది వివాహవ్యవస్థ పేరుతో ఒక కట్టుబాటు ఏర్పడింది. ఇది మానసిక బంధాలను సమకూర్చింది. అను రాగ మాధుర్యాన్ని జతపరచింది. ఆధ్యాత్మిక శిఖరాలకు చేర్చింది. కాచి చల్లార్చిన గోరువెచ్చని పాలకు మజ్జిగ చుక్కను జోడిస్తే అది క్రమంగా చిక్కబడి పెరుగవుతుంది. అలా పద్ధతి ప్రకారం తోడుకున్న గడ్డపెరుగును మంచి రుచి, చిక్కదనం జతపడతాయి. తొందరపడి పాలపొంగుకు మజ్జిగ చుక్కను జోడిస్తే సక్రమంగా తోడుకోదు సరికదా, విరిగిపోవచ్చు కూడా. దాంపత్యమూ అంతే. మనపెద్దలు ముందు వెనుక ఎన్నో ఆలోచించి ముడివేసిన బంధం. నాలుగు కాలాలపాటు స్థిరంగా నిలుస్తుంది. నలుగురితో నాకేమంటూ వయసుపొంగులో స్వయంగా జతకట్టే జంటల దాంపత్య జీవితం గడ్డపెరుగులా ఉండాలంటే కష్టం. అది పలుచని మజ్జిగలా ఉండే అవకాశమే ఎక్కువ. సంప్రదాయబద్ధంగా పెళ్లాడినంత మాత్రాన ఆలుమగల మధ్య అరమరికలు లేదా, పొరపొచ్చాలురావా..అంటే, తప్పకుండా ఉంటాయి. వస్తాయి. అయితే వాటిని ఒకప్పటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ చల్లార్చేది. పెద్దలు ఒడుపుగా సంసారాలను చక్కదిద్దేవారు. ఒక ఉదాహరణ చూద్దాం. ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో నలుగురి మధ్యాగారాబంగా పెరిగింది అమ్మడు. మనువాడిన మరుసటి నెలలో భర్తతో గొడవపడి పుట్టింటికి తిరిగొచ్చింది. 'ఆయనతో నేను వేగలేను. నన్ను సరిగ్గా పట్టించుకోవడం లేదు. నా మాట వినడం లేదు. నాకు విడాకులు కావాలి..అంతే' అని తేల్చి చెప్పేసింది. ఆ కుటుంబపెద్ద మరుక్షణమే హామీ ఇచ్చేవాడు, విడాకులు ఇప్పించేస్తానని. అమ్మాయి మొహం వికసించింది'.

ఓ సినిమాలో పాత్రలాగా, మేమంతా కళ్లు మూసుకుని కాపురాలు చేయడం లేదూ..వంటి బుజ్జగింపు లేవు ఎదురవుతాయని ఊహించిన ఆ గారాలపట్టి 'నువ్వు మంచివాడిని తాతయ్యా అంటూ సంబరపడింది'. 'విడాకులు ఇప్పిస్తావు కదా అని అడిగింది గోముగా మాట తప్పనేమనవరాలా..అయితే అంతకుముందు నువ్వు చేయవలసిన పని ఒకటి ఉంది. జాగ్రత్తగా విను' అంటూ మొదలుపెట్టాడు.

భారతీయ సంస్కృతిలో వివాహం అనేది నూరేళ్ల అనుబంధం. స్త్రీ పురుషుల మధ్య పెనవేసుకుని ఆత్మీయబంధానికి అయిదక్షరాల మాట. ఆలుమగలు. ఆడ-మగ, ఆలుమగలయ్యే ఆరక్షరాల తంతు వివాహం-ఇటీవలకాలంలో చాలా జంటల్లో వివాహబంధం అకస్మాత్తుగా విడాకుల వైపుసాగుతుండటం తీవ్ర విషాదకరం. సంసార జీవితాన్ని పూర్తిగా రుచిచూడకుండా మీ ఆయనను వదిలేసినా వస్తే అతగాడికి నొప్పి తెలియదు. నా మాట విని, ఒకటి రెండు నెలలు ఓపికపట్టి, నీ అవసరం ఎంతటిదో అతడికి తెలిసేలా చెయ్యి. అతడి జీవితంలో నీ ప్రాధాన్యం ఎలాంటిదో గుర్తించేలా చూడు. నువ్వు లేకుంటే అతడి బతుకు వెలవెలాపోతుందో గుర్తించేలా చెయ్యి. 'మనిషి దగ్గర లేకపోతే ఎవరికైనా వాళ్ల విలువ తెలుస్తుందన్నది జనవాక్యం' ఆ తరువాత అతనిని వదిలి వచ్చేయ్. దెబ్బకు మీ ఆయన గిజగిజలాడిపోతాడు. అది కూడా గెలుపు. ఇలా చేసిన తరువాత విడాకులు ఇస్తే, ఆ మజాయే వేరు. నేను చెప్పినట్లు చేసినా నీకు విడాకులు ఇప్పించే పూచీనాది' అన్నాడాయన నమ్మకంగా.

తిరిగి వెళ్లిన మనవరాలు ఎన్నాళ్లయినా పుట్టింటి మొహం చూడకపోయేసరికి తాతగారు ఎదురు అడిగారు.


విడాకుల సంగతి ఏం చేద్దామని ఆ అమ్మాయి చెప్పింది'. వద్దు తాతయ్య. నేను పక్కన లేకుంటే పాపం ఆయన ఒక్కక్షణం ఉండలేడు. విడాకుల సంగతి ఇక మరిచిపో..అంది సిగ్గుపడుతూ' భార్య అంటే బంధం, బాధ్యత, భద్రత, బలహీనత విడదీయరాని అపురూపమైన బంధం. భార్య అంటే బజారు మనిషిగా, వంటగత్తెగా భావించే మగపుంగవులు ఇంకా ఇప్పటికీ ఉన్నారు. ఇంకా కొంతమంది వంటింటికి, పడకంటికి మాత్రమే పనికివచ్చే ఒక మర అనుకునే మగ పురుగులు కూడా ఉన్నారు. కావున రెండువైపులా సహనం, సమయానికి



తగు సర్దుబాట్లు ఉండాలి. 'కీలెరిగి వాత' అనే మాటకు అర్థమిదే. ఇలా అదనుచూసి, ఎవరికి పెట్టాలో వారికి వాతలు పెట్టే తాతయ్యలు లేవకపోవడం వలన సంసారంలో కలతలకు పరిష్కారం దొరక్క కొత్తతరం జంటలు క్షణికావేశంలో విడాకుల కోసం కోర్టు తలుపులు తడుతున్నాయి. నిజానికి నేటికాలంలో విడాకులు కోరుతున్నవారిలో విడాకులు కోరుతున్న వారిలో విడిపోవడానికంటూ బలమైన కారణాలు లేకుండానే పంతానికి పోతున్నవారి సంఖ్యే ఎక్కువగా ఉందన్నది కాదనలేని చేదునిజం. ఒకవేళ వారు తల్లిదండ్రులు అయితే, పిల్లలకు తమలో ఒకరి ప్రేమను దూరం చేసే హక్కు తమకు ఎక్కడుందని ఆలోచించడమే లేదు. ఇది ఈ ఆధునిక యుగ దయనీయ దుర్గతి. నిజానికి ఇంట్లో తాతయ్యలు నిర్వహించే ఈ పాత్రను గతంలో బయట సమాజాలు పోషించేవి. 'నలుగురూ చూస్తే ఏమనుకుంటారో అనే వాక్యంలో నలుగుర్ని పదం– మనిషికి సమాజం పట్ల ఉండే జంకును సూచిస్తుంది. తప్పు చేస్తే సమాజం నిలదీస్తుందన్న బెరుకుతో మనిషి వెనక్కి తగ్గేవాడు. దురదృష్టవశాత్తు ఇప్పుడున్నవి మనుషుల గుంపులే తప్ప సమాజాలు కావు. గుంపులెప్పుడూ సమాజాలకు భయపడవు. అందుకే మనిషికి జంకుగొంకు లేకుండాపోయాయి. గుంపులకి మూక మనస్తత్వం ఓ బస్సు నో రైలునో తగలబెట్టాలన్న తెగింపుతో మనిషి ఒక్కడే ఉన్నప్పుడు రాదు. గుంపుగా ఉన్నప్పుడే వస్తుంది. మూక మనస్తత్వం లక్షణమిది. 'క్షణికావేశంలో తీసుకునే నిర్ణయాలు ఆత్మహత్య లాంటి ఆలోచనలు సైతం ఒక్కసారి వాయిదా పడితే తిరిగి అటువంటి యోచన కలిగే అవకాశం చాలా తక్కువ' అంటుంది మనస్తత్వశాస్త్రం. విడాకుల విషయంలోనూ అంతే వ్యవధి దొరికితే ఆలోచన మారే అవకాశం ఉంటుంది. ఎందుకంటే గాయం ఎంతటిదైనా దానిని మాన్పగల శక్తి కాలానికి ఉంది. గతంలో మనపెద్దలు ఆశ్రయించింది గెలిచింది ఈ తర్కంతోనే అటు తాతయ్యలు, ఇటు సమాజాలు మూగవోయిన స్థితిలో 'విడాకుల కోసం ఆరునెలలు ఆగే పని లేదు. అడగగానే



మంజూరు' వంటి వెసులుబాటు దొరికితే క్షణికావేశాలలో తప్ప ఆలోచనలకు బలం చిక్కదు. నిజానికి ఇద్దరి మధ్యా పూడ్చలేనంత అగాధం పెరిగిపోయి, ఇరువురి మనసులు దగ్గరవడం, కలిసి జీవించడం అసాధ్యమన్న పరిస్థితులు తలెత్తినప్పుడు విడాకులు తీసుకోవచ్చు. అయితే ఇలాంటివి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆనవాయితీగా మారకూడదు. విడాకులు అన్నవి సమాజ దుర్గతిగా ఎంతమాత్రం పరిణమించకూడదు. జంటల ఆలోచనలకు ఈ చీడ అసలు సోకకూడదనే మనమంతా ఆకాంక్షిద్దాం. దేశదేశాల్లో ఆదర్శప్రాయంగా పేరొందిన మన వివాహవ్యవస్థకు జవసత్వాలు చేకూరాలని ఆశిద్దాం.



కథ

# దురాశ దుఃఖానికి చేటు

రాఘవరావు అనే ఒక పెద్ద భూస్వామి. అతడు 100 ఎకరాల ఆసామి. అతని పంట పొలాలలో పని చేస్తూ వేలమంది బ్రతుకుతున్నారు. రాఘవరావు పిలిస్తే పలికే వ్యక్తి రంగన్న. అతడు రాఘవరావు ఇంటిలో ఉండి అన్ని పనులు చూసుకుంటాడు, బజారులో కూరలు తేవడం, తోట పనులు, పశువుల సంరక్షణ, అన్నీ చేస్తూ ఉంటాడు. రంగన్న చాలామంచి మనిషి. రంగన్న భార్య గడసరిది. దురాశ ఎక్కువ. రంగన్నని రోజు 'పెద్దాయన ఇంటికి కూరలు తెచ్చినప్పుడు వారి డబ్బులతో మనకి కూడా కూరలు తేవాలి. నీ జీతం ఎక్కువ పెంచమని అడుగు' అంటూరోజు తగాదా పడుతుండేది. కానీ..! రంగన్న ఒక్కరోజు కూడా భార్య మాట విని, తన వ్యక్తిత్వాన్ని, మంచి బుద్ధిని పోగొట్టుకోలేదు. రాఘవరావు రంగన్నని బాగా గమనించి, ఇలాంటి మంచి వ్యక్తి, ఇంత నమ్మకమైన వ్యక్తి ఎక్కడ దొరకడు అని మనసులో అనుకున్నాడు.



ఒకరోజు రంగన్నని, అతడి భార్యని పిలిచి మన తోటలో ఒక ఇల్లు కడతాను ఆ ఇంటి పనిని మీరిద్దరూ దగ్గర ఉండి చేయించండి అని పెద్దాయన అన్నారు. రంగన్న అలాగే బాబుగారు! అన్నాడు రంగన్న.

మరుసటి రోజు రంగన్న తన భార్యతో ఇంటిమాట చెప్పాడు. రంగన్న భార్య దగ్గర ఉండి తోటలో ఇంటి పనిని ఇద్దరం చేయిద్దాం అని ఒప్పుకుంది. తోటలో ఇల్లు కట్టడం ప్రాంభించారు. ఇంటి పనికి కావాల్సిన డబ్బులు రంగన్నకి ఇచ్చాడు పెద్దాయన.

రంగన్న భార్య అన్ని నాణ్యత తక్కువ ఉన్న వస్తువులు తెప్పించి ఇంటి పనిని పూర్తి చేసింది. పెద్దాయని ఇచ్చిన డబ్బులు దురాశతో రంగన్న భార్య మిగుల్చుకుంది. ఆ విషయం రంగన్నకి మాత్రం తెలియదు.

'బాబుగారు..!ఇల్లు పని పూర్తి అయ్యింది' అని చెప్పాడు రంగన్న. ఒకరోజు రంగన్నని అతడి భార్యని పిలిచి 'తోటలో ఇల్లు నీ కోసమే కట్టించాను' అని రాఘవరావుగారు చెప్పారు.

'ఒరేయ్ రంగన్న..! మా నౌకరీ అంతా నిస్వార్థబుద్ధితో చేస్తున్నావురా! నేను ఎంత జీతం ఇస్తే అంతే తీసుకుంటున్నావు. నీలాంటి మంచి వ్యక్తికి నేను ఎప్పుడూ మరువలేను అందుకు సంతోషంతో ఇంటి తాళాలు తీసుకుని ఆనందంగా బతకండి రా' అని పెద్దాయన అన్నారు.

రంగన్న భార్య ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అప్పుడు రంగన్నతో తను చేసిన దురాశ పనిని చెప్పింది. నాకు తగిన శాస్తి జరిగింది అని బాధపడింది.

రంగన్న భార్యని గట్టిగా మందలించాడు. అంతేకాదు ఇంకెప్పుడూ ఇలాంటి తప్పుడు పనులను చేయించవద్దని కోపంతో చెప్పాడు. బుద్ధి వచ్చిన రంగన్న భార్య, 'క్షమించండి, నాకు బుద్ధివచ్చింది, ఇంకెప్పుడూ ఇలాంటి తప్పుడు పనులు చేయనని' మాట ఇచ్చింది.

అందుకే..(దురాశ దుఃఖానికి చేటు)..అన్నారు పెద్దలు.

**- బల్ల కృష్ణవేణి,** పలాస



## బాలగేయం

### దీపావళి



దీపావళి పండుగ
బాణాల పండుగ
టపాసులతో అల్లరి చేస్తాం
తీపివంటలతో అలరిస్తాం
ఇంటిముందు దీపాలతో
అలంకరిస్తాం
కొత్తదుస్తులతో
సందడి చేస్తాం
స్నేహితులతో కలిసి
చిచ్చుబుడ్డిలను కాలుస్తాం
అయినా బాణాలంటే
భయమే మాకందరికీ
జాగ్రత్తలు పాటించకపోతే
ముప్పు తప్పుదు సుమా!
అల్లరికేరింతలు
మధురజ్ఞాపకంగా
ఉండాలంటే
అన్ని జాగ్రత్తలు పాటిస్తూ
టపాసులను కాల్చుండి!

– సండేడెస్క్

## హలో ఫ్రెండ్...



**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

## గిరీష్ అంకుల్ సమాధానాలు

**– సి.అంకుశ్,** కొత్తగూడ


ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. కొన్ని చెట్ల ఆకులు ఎర్రదనంతో ఎందుకుంటాయి?

**జవాబు: అంకుశ్!** సాధారణంగా మొక్కల్లో 'క్లోరోఫిల్' అనే ఆకుపచ్చని వర్ణ పదార్థం ఉంటుంది. ఇది సూర్యకాంతి నుంచి శక్తిని గ్రహించి ఆహారం తయారీకి ఉపయోగపడు తుంది. అయితే కొన్ని మొక్కల ఆకులు ముదురు ఎరుపులో కనిపిస్తాయి. అంటే వాటి ల్లో క్లోరోఫిల్ లేనట్లు కాదు. క్లోరోఫిల్ సూర్యకాంతిలోని ఆకుపచ్చ రంగును గ్రహించదు. అంటే సప్త వర్ణాలు కలిసిన కాంతిలో ఆకుపచ్చ మాత్రం పరావర్తనం చెందుతుంది. ఫలితంగా మన కంటికి ఆకులు హరిత వర్ణంలో కనిపిస్తాయి. అయితే కొన్ని మొక్కల్లో క్లోరోఫిల్‌తో పాటు ఇతర వర్ణ పదార్థాలు కూడా ఉంటాయి. ఇవి ఒక్క ఎరుపు రంగుని తప్ప మిగిలిన అన్ని రంగుల్నీ గ్రహించగలవు. అప్పుడు క్లోరోఫిల్ కారణంగా పరావర్తనయమ్యే ఆకుపచ్చ రంగూ, వర్ణ పదార్థాల కారణంగా పరావర్తనమయ్యే ఎరుపు రంగూ కలిసి ఆకులు మనకు ముదురు ఎరుపు రంగులో కనిపిస్తాయి.

**– కె.పి.కార్తిక్,** మంగళగిరి

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. 'ఫ్రెంచ్ లీవ్' అంటే ఏమిటి? దానికి ఆ పేరెలా వచ్చింది?

**జవాబు: కార్తిక్!** ఫ్రెంచి సైనికులు యుద్ధానంతరం పౌరుల వద్ద నుంచి వారిని అడగకుండానే కావాల్సి న వస్తువులు తీసుకుపోయేవారు, వాటికి మూల్యం చెల్లించేవారు కాదు. కనీసం ధన్యవాదాలు కూడా చెప్పేవారు కాదట. దాంతో స్వార్థపరులను, తమ సౌఖ్యం మాత్రమే చూసుకునే సంకుచిత మనస్కులను, ప్రతిఫలం ఇవ్వకుండా పనులను చేయించుకునే వారిని 'ఫ్రెంచ్ ట్రైబ్'గా వర్ణించేవారు. ఇక చెప్పాపెట్టకుండా ఆఫీసు ఎగ్గొట్టి మరునాడు వెళ్లి దొంగతనంగా అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం పెట్టే అలవాటును ఆంగ్లేయ దొరలు కనిపెట్టారు. ఇలా చేసే దానికి 'ఫ్రెంచ్ లీవ్' అని పేరు పెట్టారు.










# ఇంటర్నెట్ రారాజుగా 'గూగుల్'

డా॥బుర్రా మధుసూదన్ రెడ్డి

**మానవ** పరిణామక్రమంలో నాటి పాతరాతియుగం నుంచి నేటి నవ్య నానో-డిజిటల్ యుగం వరకు జరిగిన శాస్త్రసాంకేతిక విప్లవంతో మానవాళి జీవనశైలిలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రపంచమే కుగ్రామమైపోయింది. ఈ-మెయిల్, యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్, ఇన్స్టాగ్రామ్, మెసెంజర్‌లాంటి సామాజిక మాధ్యమాలు మన నిత్యజీవితంలో భాగం అయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ల వ్యవస్థను రిమోట్ కంట్రోల్ ద్వారా అనుసంధానం చేస్తూ సమాచారాన్ని ఒకరి నుండి మరొకరికి చేర్చడాన్ని 'అంతర్జాలం' లేదా 'ఇంటర్నెట్'గా చెప్పుకుంటున్నాం. ఇంటర్నెట్ లేదా ఇంటర్ కనెక్టెడ్ నెట్‌వర్క్ వాడకుండా గంట గడవడం అసాధ్యం తోస్తున్నది. అరచేతిలో వైకుంఠం చూపే స్మార్ట్ ఫోన్ మానవ శరీరంలో ఒక శాశ్వత అంగమై కూర్చుంది.

## వరల్డ్‌వైడ్ వెబ్ ఆవిష్కరణ

నేటి 'వరల్డ్‌వైడ్ వెబ్ (డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ)ను 1989లో 'టిమ్ బెర్నర్స్-లీ'లు కనుగొన్నారు. వరల్డ్ వైడ్ వెబ్ అంతర్జాల (ఇంటర్నెట్) ప్రక్రియల ఆవిష్కరణలతో గత 30 సంవత్సరాలుగా గ్రామీణం నుండి మహానగరాల వరకు, పల్లెగల్లీ నిరక్షరాస్యుడి నుంచి పట్టణ పట్టభద్ర డిజిటల్ నైపుణ్య మేధావి వరకు అన్నివర్గాలు, వయస్సున్న ప్రజలకు సాంకతిక విప్లవ ఫలాలు అందడం అమిత ఆనందాన్ని కలిగిస్తున్నది. 1969 అక్టోబరు 29 రోజున ప్రప్రథమంగా కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో 'చార్లీక్లైన్, లియోనార్డ్ క్లీన్‌రాఖ్'ల చొరవతో తొలి ప్రయత్నంలో 'యల్' అండ్ 'ఓ' అనే 'లాగిన్' పదాన్ని ఎలక్ట్రానిక్ ఇంటర్నెట్ మెసేజ్ ద్వారా విజయవంతంగా పంపించడం జరిగింది.

## ఇంటర్నేషనల్ ఇంటర్నెట్

అంతర్జాల అద్భుత ఆవిష్కరణతో ప్రపంచవ్యాప్తంగా పలు ఆధునిక డిజిటల్ రంగ అనంత అనువర్తనాలు వ్యక్తుల జీవితాల్లో పెనుమార్పులకు దారి తీస్తున్నాయి. అంతర్జాల డిజిటల్ విప్లవ ప్రాధాన్యతను గమనించిన సాంకేతిక సమాజం 2005 నుండి ప్రతియేటా 29 అక్టోబర్ రోజున 'అంతర్జాతీయ అంతర్జాల దినం' (ఇంటర్నేషనల్ ఇంటర్నెట్ డే) పాటించడం జరుగుతున్నది. ప్రారంభంలో ఇంటర్నెట్‌ను 'ఆర్పనెట్'గా పిలిచేవారు. ప్రస్తుతరూపంలో 'ఇంటర్నెట్'గా పిలువబడుతూ అసాధారణ విస్తరణతో 'ఇన్ఫర్మేషన్ సూపర్‌హైవే' స్థాయి రావడానికి అనేకమంది శాస్త్రజ్ఞులు, ప్రోగ్రామర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కృషి దాడి ఉందని గమనించాలి. ఇంటర్నెట్‌లో 'సర్ఫింగ్' అనే పదాన్ని 1992లో 'జీన్ ఆర్మర్ పోల్లీ' (నెట్ మమ్) అని కూడా పిలుస్తారు. ప్రవేశపెట్టడం జరిగింది. గూగుల్ సహాయంతో ఒక ప్రశ్నకు కంప్యూటర్ 0.2 సెకన్‌లలో సమాధానం ఇచ్చేంతవేగాన్ని సంతరించుకుంది.

## సామాజిక మాద్యమ విప్లవం

ఇంటర్నెట్ సహాయంతో ఫేస్‌బుక్ అనబడే సామాజిక మాద్యమాన్ని 2004లో 'మార్క్ జుకెర్‌బర్గ్' కనిపెట్టడం జరిగింది. 1971లో 'రేటాంలిన్సన్' ప్రప్రథమ ఈ-మెయిల్ పంపడంతో ఆరంభమై, నేడు 3.6 బిలియన్లకుపైగా ఈ-మెయిల్ అకౌంట్లతో రోజుకు 294 బిలియన్ల ఇంటర్నెట్ ఈ-మెయిల్స్ ప్రపంచవ్యాప్తంగా పంపించే స్థాయికి చేసింది. 1990లో మైక్రోసాఫ్ట్ విండోస్, 1994లో యాహూ, 1995లో ఇంటర్నెట్ ఎక్స్‌ప్లోరర్, 1998లో గూగుల్, 2006లో ట్విట్టర్‌లు లాంటి అనేక కృ యాప్‌లు వాడుకలోకి వచ్చాయి. 23 ఏప్రిల్ 2005న తొలి 'యూట్యూబ్' వీడియోను సాంకేతిక నిపుణుడు 'సాన్ డీగో జూ' అప్‌లోడ్ చేశాడు.

## కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్-గూగుల్

ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ వాడడానికి 50 మిలియన్ హార్స్‌పవర్ విద్యుత్తు అవసరం అవుతున్నది. ప్రస్తుతం గూగుల్‌ను 'కింగ్ ఆఫ్ ఆల్ ఇంటర్నెట్స్'గా పిలుస్తున్నారు. గూగుల్ పదానికి విస్తరణంగా 'గ్లోబల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఓరియంటెడ్ గ్రూప్ లాంగ్వేజ్ ఆఫ్ ఎర్త్'ను వాడుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబులు, కంప్యూటర్లు, లాప్‌లాప్‌లు, కెమెరాలు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వైఫై సహాయంతో ఇంటర్నెట్ సౌకర్యాలను పొందడంవరంగా మారింది. నేడు విశ్వవ్యాప్తంగా ఒక బిలియన్ వెబ్‌సైట్లకు పైగా వాడుకలో ఉన్నాయి. అంతర్జాల ఆధార కంపెనీలు మైక్రోసాఫ్ట్ 75 బిలియన్లు, ఆపిల్ 45 బిలియన్లు,




ఫేస్‌బుక్ 44 బిలియన్లు, గూగుల్ 35 బిలియన్ల అమెరికన్ డాలర్లకుపైగా బడా వ్యాపారం చేస్తున్నాయి.

**అంతర్జాల అనువర్తనాలు**

అంతర్జాలంతో ఎలక్ట్రానిక్ మెయిల్, పరిశోధనలు, డౌన్‌లోడ్ ఫైల్స్, ఆన్‌లైన్ చర్చలు, గేమ్స్, ఈ-విద్య, స్నేహం, ప్రింట్ మీడియా, సామాజిక మాధ్యమాలు, విజ్ఞాన వినిమయ ం, చలన చిత్రాలు, ఫైల్ టాన్స్పర్, వర్చువల్ సమావేశాలు, ఈ-లైబ్రరీ, కృత్రిమమేధ, ఆర్థిక, బ్యాంకింగ్ కార్యకలాపాలు మెరుగుదలకు అనేక రంగాలలో అపరిమిత ఉపయోగాలు ఉన్నాయి.

**ఇంటర్నెట్ చీకటి కోణం**

మానవాళికి అంతర్జాలం గొప్పవరంగా మారినప్పటికీ, మరో కోణంలో శాపంగా పరిణమించడం విచారకరం. పిల్లలకు విపత్తు విధించిన ఆన్‌లైన్ ఈ-తరగతులతో ఉపయోగపడుతున్న స్మార్ట్‌ఫోన్‌లు మరోవైపు అశ్లీల అభ్యంతరకర అంతర్జాల మాధ్యమాలు అరచేతిలో అందుబాటులోకి రావడం వారి భవిష్యత్తుకే ప్రమాదకరంగా మారుతోంది. స్మార్ట్‌ఫోన్ వినియోగం దుర్వాసనంగా మారింది. గంటల తరబడి నీలితెరలను అత్తుకున్నట్లయితే కంటి చూపు దెబ్బతినడం, సమయం వృథం కావడం, నేరప్రవృత్తికి బీజాలు పడడం, ఓపిక నశించడం, అనారోగ్య సమస్యలు ఉత్పన్నం కావడం, ఏకాగ్రత లోపించడం, సమాజానికి దూరంగా ఒంటరితనం కోరుకోవడం, దురలవాట్లను ప్రేరేపించడం, అశ్లీల సైట్లకు అలవాటు పడడం, పనిలో శ్రద్ధ తగ్గడం, స్థూలకాయ రుగ్మతల వలలో




పడడం, అనవసరం వస్తువులు ఆన్‌లైన్‌లో కొనడం, నిద్రలేమి, సైబర్ నేరాలు మొదలగు విషప్రభావాలను




సమాజం చవి చూడవలసి వస్తున్నది. అంతర్జాల నేరాలను కట్టడి చేయడానికి సైబర్ నేరాల అదుపులో సంబంధించిన కొత్త చట్టాలు కూడా అందుబాటులోకి రావడం చూస్తున్నాం. కంప్యూటర్ అక్షరాస్యత కనీస అర్హత అవుతున్నది. నిరక్షరాస్యులు కూడా ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. నిత్య జీవితంలో మనిషిని అంతర్జాలం చుట్టేస్తున్నది. ఇలాంటి ఇంటర్నెట్‌ను సురక్షితంగా మానవాళి సుస్థిరాభివృద్ధికి వాడుతూ, దుష్ప్రభావాలకు దూరంగా ఉంటూ, సుఖశాంతులు, సంపదలతో వసుధైక కుటుంబాన్ని నిర్మించుకుందాం. అంతర్జాలాన్ని ఆత్మసౌందర్య వికాసానికి, సులభతర జీవన విధానాలకు వినియోగించుకుందాం. 'ఇంటర్నెట్ ఈజ్ ఫర్ బెట్టర్‌మెంట్' అనే నినాదాన్ని ప్రచారం చేద్దాం. ❑

## ఎడారి రత్నాలు

**(4వ పేజీ తరువాయి)**

ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు డిస్ట్రిబ్యూషన్ ప్రారంభించాడు. ప్రపంచంలో పేరుపొందిన సోనీ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ప్రపంచంలోకెల్లా అతిపెద్ద డిస్ట్రిబ్యూటర్‌గా ఎదిగిన సామాన్యవ్యక్తి. అతిచిన్న ఎలక్ట్రానిక్స్ వ్యాపారిగా ప్రారంభమైన మను చాబ్రియా వ్యాపార సామ్రాజ్యాన్ని గెలిచాడు. ఇంకా షా వాల్లెస్ వంటి లక్కర్ వ్యాపారం, ప్రకటనల వ్యాపారం మనదేశంలో టెక్ ఓవర్‌కింగ్ అని కనిపించిన వ్యాపారాలను కొనుగోలు చేసేవాడు. 2002లో మనుచాబ్రియా హఠాత్ మరణం పెద్ద దెబ్బ పడింది కానీ. అతని భార్య విద్యచాబ్రియా ఎంతో ఓర్పుగా వ్యాపారాన్ని జాగ్రత్తగా నడిపింది. గల్ఫ్‌దేశాలలో ఎన్నో ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్‌లకు ఇప్పటికి పేరు పొందిన డిస్ట్రిబ్యూటర్ జంబో గ్రూప్. కేరళ నుండి ఒక యువకుడు పెట్రోడాలర్ కలలతో 1976లో ఒమాన్ దేశంలోకి అడుగుపెట్టాడు. ఇతనికి ఇంటీరియల్ డెకొరేషన్‌లో కొద్దిపాటి అనుభవం కాదు అవగాహన ఉంది. అప్పటి ఎడారిదేశంలో నేటి ఆకాశహర్మ్యాలను నిర్మించిన నిర్మాణ సంస్థ శోభాగ్రూప్, దుబాయ్‌లో ఎన్నో నిర్మాణాలను విజయవంతంగా పూర్తి చేసింది. దుబాయ్, ఒమాన్, ఖతర్‌వంటి దేశాల మౌలిక సదుపాయాల అందాలను దిగిన వ్యక్తి పిఎన్‌సి మీనన్. దుబాయ్‌లోని మొహమ్మద్ బిన్ రషీద్ సిటీ డెవలప్‌మెంట్‌లో భాగస్వామ్యం ఉంది. యూఏఈ, ఒమాన్, ఖతర్, బహరైన్, బ్రునై, టాంజానియా. ఇంకా మనదేశంలో కూడా ఎన్నో భవన నిర్మాణాల పనులను విజయవంతంగా నిర్వహిస్తోంది. శోభాసిటీ అనే పేరు మనదేశంలో పేరు పొందింది. మన తెలుగువారికి ఈ పేరు వినే ఉంటారు. శబరిమల యాత్రలో, కేరళలో త్రిసూర్ జిల్లా వీర జన్మస్థలం. ❑



కథ

అది తూర్పు గంగవరం గ్రామం. పచ్చని ఎత్తయిన కొండలతో, పచ్చ పచ్చని పంటపొలాలతో సుఖశాంతులతో అలరారుతున్న గ్రామం. ఆ రోజు సూర్యుడు వెలుగుపూలతో ప్రకృతికి హారతి పడ్తూ చిరునవ్వులు చిందిస్తూ గగనానికి చేరుకున్నాడు. పుడమి పులకించి దినకరునికి స్వాగతం పలుకుతుంది. విహంగములు ఆహారాన్వేషణకై బారులు తీరి ఆకాశ మార్గాలు ప్రయాణిస్తూ వున్నాయి.

# ఎండమావులు

**షేక్ మహబూబ్ జాన్**

సీతారామయ్య పెందలాడే లేచి కాలకృత్యాలు తీర్చుకొని, చద్దిఅన్నం తిని "సీతా! ఈరోజు మన పొలంలో మిర్చీకోత ఉంది. కూలీలను మాట్లాడుకున్నాను. ఎండ పడుతోంది. పెందలాడే పోయి కోత కోయించి, రాత్రికి లారీలో ఒంగోలు మార్కెట్‌కు తీసుకొనిపోవాలి. నేను కూలీలను పిలుచుకొని పొలానికి వెళుతున్నా. మధ్యాహ్నం అన్నం తీసుకొని పొలం దగ్గరకు రా! అంటూ చెప్పి సీతారామయ్య పొలానికి వెళ్లాడు.


భార్య సీతమ్మ కొడుకు బలరామ్‌ను లేపి పొద్దు పొడిచిందిరా! బారెడు పొద్దెక్కింది. స్కూలు టైం అవుతుంది లేచి త్వరగా ముఖం, చేతులు కడుక్కొని అన్నం తిని స్కూలుకు వెళ్లు" అంటూ బలరామ్‌ను లేపింది. వాడు బాగా గారాబంగా పెరిగాడు. స్కూలుకు పోవాలంటే వాడికి పడదు. చదువు సరిగా రాక, స్కూలు అంటేనే వాడికి భయం, వాడు "సరేలే అమ్మా" అంటూ లేచి కాలకృత్యాలు తీర్చుకొని స్కూలుకు వెళ్లాడు.

సీతమ్మ వంటా వార్పు చేసుకొని, అన్నంమూట కట్టుకొని భర్తకు అన్నం యివ్వడానికి పొలానికి వెళ్లింది. కూలీలు పాటలు పాడుకుంటూ, ఏవో మాటలు మాట్లాడుకుంటూ, మిరపకాయలు కోస్తున్నారు.

సీతారామయ్య దగ్గరుండి కోసిన కాయలను బస్తాలకు ఎక్కించి మూతలు దబ్బనంతో కుడుతున్నారు.

దూరంగా భార్య సీతమ్మ చిరునవ్వులు చిందిస్తూ అన్నంబుట్ట నెత్తిన పెట్టుకొని వయ్యారంగా వస్తూ వుంటే చూసి శ్రమ మరచి ఆమె వంక కొత్తగా చూస్తున్నట్లు చూడసాగాడు.

సీతమ్మ భర్తను సమీపించి "చూసింది చాలుగానీ అన్నం తెచ్చాను, చేతులు మొఖం శుభ్రంగా కడుక్కొని ఆ చెట్టు కిందకు రా" అంటూ నవ్వుతూ చెప్పి, గుబురుగా పెరిగిన వేపచెట్టు కిందకు చేరింది.



సీతారామయ్య కూలీలను కూడా అన్నం తినడానికి పురమాయించాడు. అందరు అన్నం తినడానికి చెట్టు కిందకు చేరారు. కూలీలు సరదా సరదా మాటలతో నవ్వుకుంటూ అన్నం తిని వెళ్లిపోయారు.

సీతమ్మ భర్తతో "ఏమండోయ్, మన కొడుకు సరిగా బడికి పోవడం లేదు. చదువు మీద వాడికి ధ్యాస లేదు. సోమరిపోతు పిల్లలతో తిరుగుతున్నాడు. వాడికి చదువెందుకుగానీ మీతో పాటు పొలానికి తీసుకొనివచ్చి, పొలం పనినేర్పితే గాలికి తిరిగి చెడిపోకుండా బాగుపడ్తాడు" అంది. ఆ మాటలకు సీతారామయ్య "సరే ఆ పని చేద్దాం. కాస్త నాలుగు అక్షరముక్కలు నేర్చుకొని లెక్కపద్దు అయిన చూసుకుంటాడు. అప్పటికి ఏదో విధంగా లాక్కొద్దాం" అన్నాడు.

"సీతా, ఈరోజు రాత్రి మిరపకాయలు తీసుకొని వెళ్లడానికి సుబ్బారెడ్డిగారి లారీ వస్తుంది. మిరపకాయలు ఐదారు బస్తాలు అయ్యేటట్లు వుంది. అవి తీసుకొని రాత్రికి ఒంగోలు మార్కెట్టుకు పోయి అమ్ముకొని వస్తాను. నీకు ఏమైనా కావాలా చెప్పు. వచ్చేటప్పుడు నీవు అడిగింది తీసుకొని వస్తాను" అన్నాడు మురిపెంగా. భార్య సీతమ్మ "మీరు క్షేమంగా వెళ్లి కాయలు అమ్ముకొని రండి. అదే నా కోరిక" అంది. ఇద్దరు నవ్వుకుంటూ పనిపాటలో మునిగిపోయారు. సీతారామయ్య మిరపకాయలు తీసుకొని లారీ ఎక్కి ఒంగోలు కూరగాయలు మార్కెట్టుకు బయలుదేరాడు. లారీ నిండా సామానులు, ఆపైన మిరపకాయ మూటలు వేసుకొని వాటితో పాటు రైతులు లారీపై ఎక్కారు. లారీ రాత్రి 11 గంటలకు గంగవరం నుండి బయలుదేరింది. లారీ పైన కూర్చున్నవారు, అదీ ఇదీ మాట్లాడుకుంటూ కూర్చొని వున్నారు.

లారీ పేర్నమిట్ట దాటి ఒంగోలులోకి ప్రవేశించింది. లారీకి అడ్డుగా ఏదో బండి రావడంతో సడన్‌గా బ్రేక్ వేశాడు లారీ డ్రైవరు. ఆ కుదుపుకు లారీపై కూర్చొన్న సీతారామయ్య పట్టు తప్పి ఎగిరి కింద పడ్డాడు. ఆ హఠాత్ పరిణామానికి నివ్వెరపోయి రైతులు సీతారామయ్య కిందపడ్డాడు. సీతారామయ్య కింద పడ్డాడు అని బిగ్గరగా కేకలు వేశారు.

లారీ ఆపి అందరు కిందకు దిగారు, రోడ్డ మీదపడి తల పగిలి రక్తం కారుతోంది. సీతారామయ్య చివరి క్షణాలలో వున్నాడు. వెంటనే 108కు ఫోన్ చేశారు. ఒక అరగంట తర్వాత బండి వచ్చి సీతారామయ్యను రిమ్స్ తీసుకొని వెళ్లింది.

అక్కడ డాక్టర్లు సీతారామయ్యను బతికించడానికి శాయశక్తులా పనిచేశారు. కానీ సీతారామయ్య చనిపోయాడు.

ఈ వార్త గంగవరంలో భార్య, పిల్లలకు, బంధువులకు తెలియజేశారు. అందరు రిమ్స్ కు చేరి, రోదించి, పోస్టుమార్టం చేసిన తరువాత సీతారామయ్య పార్థివ దేహాన్ని తీసుకొనిపోయి ఊర్లో ఖననం చేశారు.

సీతమ్మ భర్త మరణాన్ని తట్టుకోలేక కొన్నాళ్లు చాలా దుఃఖించి, చేసేది లేక కొడుకు బలరామ్‌ను తీసుకొని, పొలం కౌలుకు ఇచ్చి, కూలీ నాలీ చేసుకుంటూ జీవనం గడపసాగింది. కొడుకు పెద్దవాడు అయిన తరువాత ఒక అమ్మాయిని తెచ్చి పెళ్లి చేసి తన వంతు బాధ్యతను తీర్చుకుంది సీతమ్మ.

పెళ్లి చేసిన కొన్నాళ్లు సీతమ్మ కొడుకు కోడలు బాగానే చూసుకున్నారు. తరువాత పొలం అంతా తమ పేరున రాసివ్వమని రోజూ గోల చేయసాగారు. అంతేకాకుండా సీతమ్మకు పక్షవాతం వచ్చి కాలు, చేయి పడి మంచాన పడిపోయింది. వైద్యం చేయించాక కాస్తో కూస్తో యింట్లో తిరగసాగింది. ఆమెకు కోడలు సేవలు చేయలేక రోజూ నానా యిబ్బందులు పెట్టడం పెట్టింది. తిట్టడం, కొట్టడం మొదలు పెట్టింది. కొడుకు కూడా భార్యకు వంత పాడుతూ కని పెంచి, పెద్ద చేసి, పెళ్లి చేసి ఒక దారికి తెచ్చిన తల్లిని తిడుతూ బాధించసాగాడు.

సీతమ్మ ఈ కష్టాలు పడలేక పొరుగువారి సహాయంతో ఊరిపెద్ద పెదరాయుడు దగ్గరకు పోయి తనను కాపాడమని చేతులు ఎత్తి మొక్కుతూ కాళ్లా వేళ్లా పడింది. పెదరాయుడు ఊరి పెద్ద. అతని మాటను అందరు గౌరవిస్తారు. పెదరాయుడు చెప్పిన మాట వినకపోతే వారికి తగిన శిక్షలు వేస్తారు. దానికి అందరు సహకరిస్తారు.

**"అయ్యా, నాకు నా అనేవాళ్లు వుంటే అర్ధరాత్రి రోడ్డు మీదకు ఎందుకు వస్తాను? నాకు ఎవరూ లేరు. కొడుకులు ఎండమావులు లాంటి వారని మా ఊరిపెద్ద చెప్పాడు. అందులోని నీళ్లకై ఆరాటపడవద్దు, అందులో నీళ్లు వుండవని, మనం బాగున్నప్పుడే అని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పాడు" అంది.**

ఆయన సీతమ్మ వేదనను గ్రహించాడు. ఒకరోజు ఊరి మధ్య మరిచెట్ల కింద పంచాయితి పెట్టాడు. పెదరాయుడు కూర్చొని వున్నాడు. సీతమ్మ ఒక పక్క నిలబడి వుంది; కొడుకు, కోడలు మరోవైపు నిలబడి వున్నారు.

"మీ అమ్మను మీరిద్దరు నానా యిబ్బంది పెడుతున్నారని మీ అమ్మ సీతమ్మ ఫిర్యాదు చేసింది. నవమాసాలు మోసి, కనిపెంచిన దేవత తల్లి. భగవంతుడు తనకు మారుగా పంపిన దేవతా! తల్లిని గౌరవించి ఆమెకు అన్ని విధాలుగా సేవ చేయడం కొడుకుగా నీ ధర్మంరా! నీ చిన్నతనంలోనే మీ నాన్న చనిపోతే నిన్ను కడుపులో పెట్టుకొని నీకు ఏ కష్టం రాకుండా, తాను నానా కష్టాలు పడి నిన్ను పెంచి పెద్ద చేసి, పెళ్లి చేసి నిన్ను ఒక యింటివాడిని చేసిందిరా మీ అమ్మ. సీతమ్మ లాంటి అమ్మను నీవు నీ భార్య చెప్పుడు మాటలు విని కష్టపెట్టడం మంచిది కాదు.

తల్లిదండ్రులు బిడ్డలను సాకి పెద్ద చేసి వయసు మళ్లిననాడు మీరు వారికి అండగా వుండి వారి సంతోషాలు చూస్తారని భావించే పిచ్చివాళ్లురా. మీరు ఎండమావుల్లాంటివారని, వారు అర్థం చేసుకోలేకపోతున్నారు. నీవు, నీ భార్య ఆమెను తిట్టినా, కొట్టినా బాధించినా మీ ఇద్దరినీ వూరి నుండి వెలి వేస్తామని ఈ పంచాయితీ సాక్షిగా చెబుతున్నా" జనం హర్షధ్వానాలతో తమ సమ్మతి తెలియజేశారు. అది జరిగిన తరువాత కొన్నాళ్ల వరకు బాగానే చూసుకున్నారు. ఎవరు చూస్తారులే అని సీతమ్మను మళ్లీ బాధలు పెట్టసాగారు. ఒకరోజు అర్ధరాత్రి సీతమ్మ ఆ బాధలను తట్టుకోలేక పాకుకుంటూ రోడ్డు మీదకు వచ్చింది. గాడాంధకారం, నిశిరాత్రి.. జనమంతా గాఢనిదురలో వున్నారు. ఆమె రోడ్డు మీదకు రాగానే ఊరకుక్కలు ఆమె పైకి లంఘించుకున్నాయి. చుట్టూ కుక్కలు చేరి కరవసాగాయి. సీతమ్మ బాధతో కేకలు పెట్టసాగింది. కానీ కుక్కలు ఆమెను వదలలేదు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న అంబులెన్స్ డ్రైవర్ ఆ దృశ్యాన్ని చూసి వెంటనే బండిని ఆమె దగ్గరకు వచ్చి బండి ఆపి, కుక్కలను తరిమి కొట్టాడు. అప్పటికే ఆమెకు అక్కడక్కడ గాయాలై రక్తం కారుతోంది, సీతమ్మ స్పృహ తప్పి పడిపోయింది. అంబులెన్స్ వాళ్లు ఆమెకు అంబులెన్స్‌లో ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రికి తీసుకొని వెళ్లారు.

వైద్యులు తగిన వైద్యం చేసారు. నాలుగైదు రోజుల తర్వాత సీతమ్మ మనిషి అయింది. ఆమెకు పూర్తి ఆరోగ్యం చేకూరిన తరువాత డాక్టరు "ఎవరు నీవు, ఏ ఊరు?" అని అడిగారు. సీతమ్మ నోటి వెంట మాట రాలేదు. కన్నీళ్లు ధారాపాతంగా కారుతున్నాయి. ఆ కన్నీళ్లు ఆమె బాధలకు సమాధానం చెబుతున్నాయి.

"అయ్యా, నాకు నా అనేవాళ్లు వుంటే అర్ధరాత్రి రోడ్డు మీదకు ఎందుకొస్తాను. నాకు ఎవరూ లేరు. కొడుకులు ఎండమావులు లాంటి వారని మా ఊరి పెద్ద చెప్పాడు. అందులోని నీళ్లకై ఆరాటపడవద్దు, అందులో నీళ్లు వుండవనీ, మనం బాగున్నప్పుడే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పాడు" అంది.

"నేను ఎక్కడికీ వెళ్లను. నన్ను క్షమించి నాకింత విషం యివ్వండి. విషం తిని ఆనందంగా చనిపోతా" అంటూ ఆమె చేతులు జోడించి అడిగింది.

డాక్టరు ఆమెను ఓదార్చి "అవసాన దశలో చాలా మంది కొడుకులు తల్లిదండ్రులను తీరని బాధలకు గురి చేస్తున్నారు. అందుకే బజార్లలో చాలా మంది ముసలివారు ఎండనక, వాననక, రాత్రనక, పగలనక తిరుగుతూ ఏదో తిని, ఎక్కడో నిదురపోయి అశాంతిగా జీవనం సాగిస్తూ జీవనం కొనసాగి స్తున్నారు. ఇటువంటి వారికి ప్రభుత్వం తగిన సహాయం సహకారాలు అందించి వారి శేష జీవితం ప్రశాంతంగా జరిగేటట్లు చూడాలి" అంటూ– "నిన్ను మదర్ థెరెసా వృద్ధాశ్రమంలో చేరుస్తాం. అక్కడ నీకు ఎటువంటి అసౌకర్యం కలగదు. ప్రశాంతంగా జీవించవచ్చుని" చెప్పి సీతమ్మను ఆశ్రమంలో చేర్పించారు. ఆమె అక్కడ చేరి కన్నీళ్లతో ఆమెకు సహాయం చేసిన వారందరికీ నమస్కారాలు చేసింది.

ఎండమావులను చూసి మోసపోవద్దని ఆమె చెప్పిన మాటలను వచ్చినవారు మననం చేసుకుంటూ వెళ్లిపోయారు. ●



# భక్తిమార్గం

డా॥ పులివర్తి కృష్ణమూర్తి

**ప్రేమా పిచ్చి ఒకటే అన్నారొకరు. అయితే భక్తి కూడా ఆ కోవకు చెందినదే అనుకోవాలి. భక్తుల ప్రేమకు అవధులు వుండవు. అది ఒక విధంగా అనిర్వచనీయం. ముందు భక్తుడికి అచంచలమైన విశ్వాసం నమ్మకం ఉండాలి. మనకు పురాణాలలో ఒక హనుమంతుడు, మరొక ప్రహ్లాదుడూ కనిపిస్తారు. ఇంతటి భక్తులు మరొకరుండరేమో అన్నంతగా వీరి సమర్పణ వుంటుంది.**

ప్రహ్లాదుడు ఆ శ్రీహరిని ఎక్కడెక్కడ వెతికి చూసినా అక్కడక్కడనే కనిపిస్తాడని నమ్మినవాడు. శ్రీహరిని సేవింపని శరీరం, కేవలం గాలితో నిండిన కొలిమితిత్తిగానీ శరీరమవుతుందా? అంటూ ప్రశ్నించాడు. శ్రీహరిని పూజించే చేతులే చేతులని, శ్రీనాథుని వర్ణించే నాలుకే నాలుకని, శ్రీపతిని చూసే చూపులని, శేషశాయికి మొక్కే శిరస్సే శిరస్సు, విష్ణు కథలను వినే చెవులే చెవులు, మధుసూదనుని తలంచే మనస్సే మనస్సు. భగవంతునికి ప్రదక్షిణలు చేసే పాదాలే పాదాలు, పురుషోత్తమునియందు నిలిచే బుద్ధియే బుద్ధి, దేవదేవుని గురించి ఆలోచించే దినం, చక్రధారిని గురించి తెలియచేసే చదువే చదువు, గోవిందుని గురించి బోధించే గురువే గురువు అంటూ తన తండ్రికి తాను నమ్మిన విషయాలను జంకకుండా విన్నవించుకున్నాడు. ఇంద్రాది దేవతల నోడించి ముల్లోకాలను జయించి ఏకైక నాథుడై వెలియుచున్న రాక్షసరాజు తనకు తెలిసిన మారణ ప్రక్రియలన్నింటినీ ఐదేండ్ల బాలుడైన ప్రహ్లాదునిపై ప్రయోగించినా అతడు చనిపోకపోవడంతో ఆశ్చర్యపోయి ఇంకేమి చేయాలో తోచక నిస్పృహ చెందాడు. ఈ సందర్భంగా ప్రహ్లాదుడు చెప్పిన విషయాలు గమనించదగినవి.

శ్రీహరి వ్రతాల ద్వారాగానీ, క్రతువుల, దానాల, శీల, తపముల, యుక్తి తర్కముల ద్వారాగానీ సులభంగా చిక్కకు. భగవంతుని భక్తి ద్వారా మాత్రమే పొందవచ్చన్న సందేశం లోకానికి మార్గదర్శకం.


శ్రీమద్భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ ఇలా సెలవిచ్చారు. సమస్త కర్మలూ నాకే సమర్పించి, నన్నే పరమగతిగా భావించి, ఏకాగ్రతతో నన్ను ధ్యానిస్తూ సేవించే భక్తులనూ, మనస్సు నా మీదే నిలిపే వాళ్లను, మృత్యు ముఖమైన సంసార సాగరం నుంచి అచిర కాలంలోనే నేను ఉద్ధరిస్తాను. శత్రువుల పట్ల, మిత్రుల పట్ల, అలాగే మానావమానాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, దూషణ భూషణల పట్ల సమభావం కలిగినవాడు, దేనిమీదా ఆసక్తి లేనివాడు, మౌనంగా వుండేవాడు, ఏ కొద్దిపాటి దొరికినా సంతృప్తి చెందేవాడు, స్థిర నివాసం లేనివాడు, దృఢ నిశ్చయం కలిగినవాడూ అయిన నా భక్తుడంటే నాకు ఎంతో ఇష్టం అన్నాడు పరమాత్మ.

భక్తిని నిర్వచించిన తాత్త్వికులు ఈశ్వరుని మీద గాఢానురాగమే భక్తి అన్నారు. భగవంతుడు ప్రేమ అనే సంగతిని జ్ఞాపకం వుంచుకోవాలని చెప్పారు.

రామాయణంలో హనుమంతుడు గొప్ప రామభక్తుడు. రామ నామం వింటే పులకించి పోయేవాడు. మానవునిలో ఏవి వుంటే శ్రేయోభివృద్ధులు కలిగి ప్రసిద్ధి వహించి, తరిస్తాడో అవన్నీ కలవాడు హనుమంతుడు. శ్రీరాముని సేవకు ఆకృతిగా మారుతిని చెప్పుకోవాలి. ఎక్కడ రామ నామం స్మరించబడుతుందో అక్కడ స్వామి వచ్చి కూర్చుంటాడని చెబుతారు. అంతటి దాస్య భక్తి ఆయనది.

మానవుల్లోనేగాక దానవుల్లోనూ భగవంతుని ప్రసన్నత కోసం తన పేగులనే వీణాతంతులుగా, రుద్రవీణను పలికించి గానం చేసి ప్రత్యక్షం గావించుకున్న రావణుడూ మహాభక్తుడే.

కీర్తనలు గానం చేస్తూ, కీర్తనా మార్గాన్ని భక్తరామదాసు, వాల్మీకీ ఎంచుకోగా– సఖ్య భక్తిని అర్జునుడూ, సుగ్రీవుడూ ఎన్నుకున్నారు.




ఆత్మనివేదన కూడా భక్తి మార్గంగానే చెబుతారు. ద్రౌపది ఈ మార్గాన్నే ఎన్నుకుంది. భరతుడు రామ పాదసేవనా భక్తిని ఆచరించి ధన్యుడైనాడు. ఎన్ని మార్గాలను ఎవ్వరు అనుసరించినా, మనిషిలో వున్న నిగూఢంగా నిక్షిప్తమైన అఖండమైన శక్తిని అంటే ఆధ్యాత్మిక శక్తిని వెలికితీయాలంటే భక్తి మార్గం ఒక్కటే సరైన మార్గం.

# తెలుగు సాహిత్యంలో 'గురజాడ' దీప్తి

**జయసూర్య**

"ఆకులందున అణగిమణగీ
కవితకోయిల పలుకవలెనోయ్"

దేశాన్ని ప్రేమించాలని, ఆ దేశం మట్టి కాదు మనుషులనీ, మత, కుల విద్వేషాలు తగవనీ, ఏకత్వ భావం జాతి పురోగతికి దోహదం చేస్తుందని, కవితతో దేశాభిమానం మొలకెత్తాలని నవ్యకవితా వైతాళికునిగా గురజాడ అప్పారావు, తెలుగు వాఙ్మయాన్ని ఉద్యమ మహోదధిలో పూసిన వెన్నెల పూవులా, జాతిలో ఆత్మవిశ్వాసం, పరస్పర ప్రేమార్ద్రత, దేశ ప్రేమాభిమానాలు చివురింపచేసారు. ప్రియురాలికి మాత్రమే పరిమితమైన నాటి భావ కవిత్వ భావనా ఉద్విగ్నత 1910లో గురజాడవారి ముత్యాల సరాలతో విశ్వమానవ ప్రేమగా సాహిత్యాన్ని ఉద్దీప్తం చేసింది. ప్రేమ కేవలం పాత అర్థంలోనే కాకుండా ఉదాత్త, ఉన్నత భావ కవిత్వ వ్యక్తీకరణతో, తోటి మానవుని ప్రేమించే ప్రవృత్తి ప్రసాదించింది. లవణరాజు కలలో "మలిన దేహుల మాలలనుచును" వర్ణధర్మం, కులాధిక్యతకు ఆస్కారం కల్పించే సామాజిక ధర్మంపై గురజాడ ధ్వజం ఎత్తారు. 'కన్యక', 'పూర్ణిమ'లోనూ..




**"మేలిమి బంగరు మెలతల్లారా
కలువల కన్నుల కన్నెల్లారా
తల్లులగన్నా పిల్లల్లారా
విన్నారమ్మా యీ కథను"**

ధనాశ, బాల్య వివాహాలు సృష్టిస్తున్న క్రూర, వికృత జీవన అమానవీయ ధోరణులపై, తెలుగుజాతి గుండెను గురజాడ కదిలించారు. చిన్న చిన్న వృత్తాలలో ఖండికలుగా, జానపద గీతచ్ఛాయలో కన్నడంలోని షట్పది, పార్సీలోని గజల్ కలయికతో, పదాల జిగిబిగి కాకుండా, నగిషీలు కృత్రిమత్వం లేని శైలితో, నాటి దుష్ట సామాజిక దురాచార, మూఢత్వంపై కరుణ, దయ, ప్రేమ, మానవతా విలువల కోసం గురజాడ తపించే మార్గం చూపించారు.

నవ్య సాహిత్య వికాస పరిణామ దశ 1910–1935లో రాష్ట్రోద్యమం, జాతీయతా భావం, విశ్వజనీన ప్రేమ వంటి మహోన్నత లక్ష్యాల దిశలో ప్రబోధ సాహిత్యంగా అనంతరం వెల్లివిరిసింది. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు, విశ్వనాథ సత్యనారాయణ, దువ్వూరి రామిరెడ్డి, కట్టమంచి రామలింగారెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, వేదుల సత్యనారాయణ శాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, గుఱ్ఱం జాషువా, దాశరథి కృష్ణమాచార్యులు వంటి మహాకవులు ఎందరో పాశ్చాత్య, వంగ సాహితీ, స్వదేశీ ప్రభావంతో స్వదేశీ రాష్ట్రాభిమానం, వర్తమాన సాంఘిక స్థితిగతుల రుగ్మతలపై, ప్రబంధ శిల్పాన్ని, వస్తువులను కాదంటూ ప్రాచీన, పూర్వ మర్యాదలను మన్నిస్తూనే భావ కవితా రీతులలో ఆత్మాశ్రయతకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆనాటి మహిళ దుస్థితిని ప్రేమ స్వరూప పాత్రలతో నిష్కామ ప్రేమమూర్తుల చిత్రణగా కొనసాగింది. ప్రేమ తత్త్వాన్ని ఆపాదించే 'తృణ కంకణం' వస్తుకవితగా, కవితా శిల్ప రీతులలో విభిన్నత మొగ్గ తొడిగింది. నాయని సుబ్బారావు 'సౌభద్రుని ప్రణయ యాత్ర', 'మాతృగీతాలు', అబ్బూరి రామకృష్ణారావు, 'ఊహాగానం', నండూరి సుబ్బారావు 'యెంకి పాటలు', బసవరాజు అప్పారావు, అడవి బాపిరాజు, దేవులపల్లి కృష్ణశాస్త్రి, చింతా దీక్షితులు, తల్లావఝుల శివశంకర శాస్త్రి, కాటూరి వెంకటేశ్వరరావు, పింగళి లక్ష్మీకాంతం, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, పిలకా గణపతి శాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, భావ కవిత్వ కొంగ్రొత్త భావాలు కొత్త పద చిత్రాలతో సాహితీ సమితి వంటి సంస్థలు, సాహితి, సఖి, భారతి వంటి పత్రికలు ప్రోత్సాహంతో స్వేచ్ఛాగాన ఝురులు పాత, కొత్తల మేలి కలయికగా ఆత్మాశ్రయంగా తెలుగు నవ్య కవిత విలసిల్లింది.



ఆధునిక తెలుగు సాహిత్యంలో సంస్కృత రచనలపై, ప్రబంధ సాహిత్యంపై ఆధారపడిన తెలుగు సారస్వతాన్ని భావ కవితా ఉద్యమం కొత్త పుంతలు తొక్కించింది. నవ్య కవితా పితామహుడిగా రాయప్రోలు తెలుగు సాహితీ జగత్తులో భావ కవిత్వ పరిమళం వెదజల్లారు. భావ కవిత్వానికి ప్రేరణ ఆంగ్ల సాహిత్యం అయినా దాన్ని గుడ్డిగా అనుకరించలేదు. గురజాడ, శ్రీశ్రీ లాంటి మహాకవులు సైతం తొలి నాళ్లలో భావకవిత్వాన్ని ప్రోత్సహించినవారే.

1913లో రాయప్రోలువారి తృణకంకణంలో 'అమలిన శృంగార తత్త్వాన్ని ఆవిష్కరించారు. "చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్వల చరిత్ర/హృదయములు చీల్చి చదువుడో సదయులారా?" అంటూ రాయప్రోలు యావదాంధ్ర జనుల పక్షాన ఆలపించారు. ఎందరినో వర్ధమాన భావ కవులకు నవ్య సాహిత్య వికాస పరిణామ దశలో భావ కవిత్వం స్ఫూర్తిదాయకమైంది.

కన్యాశుల్కపు పెళ్లిళ్ల, ఉంపుడుగత్తెలు, బాలికలకు వృద్ధులతో వివాహాలు, వైధవ్యాలు, వేధింపులు, స్త్రీ విద్య, కులమతాల కుమ్ములాటలు నాటి సామాజిక దురాచార వ్యవస్థపై గురజాడ తిరుగుబాటు తెలుగు సాహిత్యంలో నవ్య భావోత్తేజం నడిపించింది. గురజాడ నవయుగ వైతాళికునిగా కందుకూరి, గిడుగుల స్ఫూర్తితో వ్యవహారిక భాషోద్యమానికి సారథ్యం వహించారు. తిక్కన, వేమన, వీరేశలింగం, గిడుగు, గురజాడ, చలం, శ్రీశ్రీ తెలుగు సాహిత్యంలో నవ్య, భావ, అభ్యుదయ తదితర ప్రక్రియలతో తెలుగు సాహిత్యానికి సజీవ చైతన్యం ప్రసాదించారు. మహాకవి గురజాడ బాటలో, భావ కవితోద్యమంతో తెలుగు సాహిత్యం మలుపు తిరిగిన సువర్ణ అధ్యాయం ఆవిష్కృతమైంది.

# గురుశిష్యులు

యామిజాల జగదీశ్

మనం ఎందరో గురువుల గురించి ఆ నోటా ఈ నోటా వింటుంటాం. కొందరు గురువులనైతే ప్రత్యక్షంగా చూసి కూడా ఉంటాం. అలాగే శిష్యుల గురించి కూడా వింటూ ఉంటాం.

శిష్యులలో రెండు రకాలవాళ్లు ఉంటారు. గురువులు తాముగా చూసి ఎంపిక చేసుకున్న శిష్యులు ఒక రకం. ఇంకొక రకమేమిటంటే- శిష్యులే గురువులను వెతుక్కుంటూ వచ్చి తమను శిష్యుడిగా చేసుకోమని అడిగేవారు. అంటే శిష్యులే తమ గురువులను ఎంపిక చేసుకుంటారన్న మాట. కానీ గురువులు శిష్యులను ఎంపిక చేయడమే ఉన్నతమైంది. ఎందుకంటే, ఆయన తాను ఎంపిక చేసినట్టు తెలిస్తే అతనిలో అహంకారం తలెత్తుతుందని ఆయన అభిప్రాయం.

అనగనగా ఓ సూఫీ జ్ఞాని. ఆయన వద్ద ఓ శిష్యుడు ఉన్నాడు. అతను మనం చెప్పుకున్న రెండు రకాల శిష్యులలో రెండవ వర్గానికి చెందినవాడు. ఆ శిష్యుడు గురువుగారి దగ్గర ఎప్పుడూ ఏదో ఒకటి అడుగుతుంటాడు. ఒకోసారి పదే పదే అడిగి నస పెడుతుంటాడు. గురువుగారు అతని వైఖరిని చాలా కాలం భరించారు, ఇక లాభం లేదనుకున్నారు. ఓరోజు శిష్యుడిని దగ్గరకు పిలిచారు. విలువైన ఓ రాయి అతనికి ఇచ్చారు "దీనిని కాయగూరలు అమ్మే బజారుకి తీసుకుపో. అక్కడ దీనిని అమ్మేసెయ్" అన్నారు గురువుగారు.

గురువుగారు ఇచ్చిన ఆ రాయి తళతళలాడుతోంది. ఆ రాయి మామూలు కాదు. పెద్దది, వెలకట్టలేనిది.

గురువుగారతనితో "ఈ రాయి నిజంగానే అమ్మేయకు.. అమ్ముతున్నట్టు నటించు. పలువురిని చూడు. వారు ఏం చెప్తున్నారో గమనించు" అన్నారు.

"సరేనని" శిష్యుడు ఆ రాయి తీసుకుని సంతకు వెళ్లాడు. పలువురిని కలిశాడు. ఆ రాయి కాయగూరలు అమ్మడానికి తూకం రాయిలా ఉపయోగపడుతుందన్నారు కొందరు. ఇంకొందరేమో దానిని కొనుక్కుని తమ పిల్లలకు ఇచ్చి వారితో ఆటలాడించవచ్చనుకున్నారు. ఇలా ఒక్కొక్కరూ ఒక్కోలా ఆ రాయిని తక్కువ ధరకు ఇవ్వలసిందిగా అడిగారు. కానీ గురువుగారు అమ్మవద్దని, విషయం తెలుసుకురమ్మన్నారు కదా అనుకుని ఆ శిష్యుడు రాయితో తిరిగొచ్చాడు.


గురువుగారితో తాను సంతలో గమనించిన విషయం చెప్పాడు. దాదాపుగా అందరూ ఈ రాయిని తక్కువ ధరకు అడిగారన్నాడు.

"వంద రూపాయలకు మించి దీనిని అమ్మడం అసాధ్యం" అన్నాడు శిష్యుడు.

అతను చెప్పినదంతా విన్న గురువుగారు "సరేగానీ, ఇప్పుడు దీనిని తీసుకుని బంగారు నగలు అమ్మే దుకాణాలకు వెళ్లిరా" అన్నారు.

"అలాగేనని" ఆ శిష్యుడు బంగారు నగల దుకాణాలకు వెళ్లొచ్చాడు. అక్కడ వెయ్యి.. రెండు వేల రూపాయల వరకు ఇస్తాం తమకు అమ్మమని నగల వ్యాపారులు అడిగారన్నా"డు శిష్యుడు.

సంతలో కన్నా అక్కడివారి మనసు కాస్త విశాలమైందని భావించాడు శిష్యుడు. "సరే.. బాగుంది.. ఇప్పుడు నువ్వు దీనిని తీసుకుని వజ్రాల వ్యాపారి దగ్గరకు వెళ్లిరా.. వాళ్లేంచెప్తారో తెలుసుకురా" అన్నారు గురువుగారు.



"అలాగేనని" శిష్యుడు వజ్రాల వ్యాపారుల వద్దకు వెళ్లాడు. యాభై వేల రూపాయలు ఇస్తామని కొందరు చెప్తే మరికొందరు లక్ష రూపాయల దాకా ఇస్తామన్నారు.

శిష్యుడు గురువుగారి దగ్గరకు తిరిగొచ్చాడు. విషయం చెప్పాడు "లక్ష రూపాయల దాకా ఇస్తానన్నారు... వారొట్టి పిచ్చివాళ్లలాగా ఉన్నారేంటీ? సంతలో వంద రూపాయలు ఇవ్వడానికి ఆలోచిస్తున్నారు. అలాంటిది వజ్రాల వ్యాపారి లక్ష వరకూ ఇస్తానన్నారేమిటీ?" అని గురువుగారి వంక అయోమయంగా చూసాడు.

అప్పుడు గురువుగారు శిష్యుడితో "నువ్వు అమ్మకపోవడంతో దాని ధర ఎలా పెరుగుతూ వచ్చిందో చూడు.. నీకు రాయి కన్నా వారిస్తామన్న డబ్బులు ప్రధాన విషయంగా అనిపించింది. నువ్వు సంతకు వెళ్లినప్పుడు దాని ధర వంద రూపాయలు. నువ్వు సంతకు వెళ్లినప్పుడు దాని ధర అంతే అనుకున్నావు. నువ్విప్పుడు ఆ కాయగూరల సంత దగ్గరే ఆగిపోయావు. అంటే నీ మానసిక స్థితి అలాగే ఉంది. నువ్వు ఆలోచించే విలువ వంద రూపాయలు దాటలేదు. కానీ నువ్వు వజ్రాల వ్యాపారి వద్దకు వెళ్లావు. వారు లక్ష రూపాయలు ఇస్తామనేసరికి నీకు విచిత్రంగా అనిపించింది. అందుకే "ఓ గురువు దగ్గర శిష్యుడిగా ఉండటానికి ఓ అర్హత ఉండాలి. అప్పుడే అది ప్రయోజనకరమైన గురు-శిష్య బంధంగా మారుతుంది. లేకుంటే వృథా ప్రయాసే. గురువెన్ని చెప్పినా ఆ శిష్యుడు ఎదగడు" అన్నారు.

ఓ వ్యక్తి గురువుగారిని వెతుక్కుంటూ వెళ్లాడు. తనను శిష్యుడిగా స్వీకరించమని కోరాడు. అయితే ఆ గురువుగారు "నా దగ్గర శిష్యుడిగా ఉండటానికి నీకున్న అర్హత ఏమిటి?" అని అడిగారు.

అప్పుడతను "గురువుగారూ, గతంలో మీరున్న జైలులో నేను మీతో కలిసున్నాను. ఇప్పుడు మీలాగా నేనూ మారువేషంలో వచ్చాను. మనిద్దర్ని ఇప్పుడు ఎవరూ గుర్తించలేరు. ఇంతకన్నా నాకు ఉండాల్సిన అర్హత ఏమిటో చెప్పండి" అన్నాడు అతను.

అప్పుడు ఆ గురువు అక్కడున్న గుంపులో ఒకరిని చూడమని చెప్తూ "మనల్ని ఆ పెద్దమనిషి గుర్తు పట్టనంతవరకూ మనకే నష్టమూ లేదు. ఏ సమస్యా తలెత్తదు. మనం మన రోజుల్ని దర్జాగా గడిపేయొచ్చు" అన్నాడు గురువు.

"మీరంటున్న ఆ మనిషి ఎవరండీ?" అని అడిగాడు శిష్యరికం కోసం వచ్చినతను.

"ఆయన ఎవరో కాదు, మనం జైలుజీవితం గడిపిన జైలుకి సూపరింటెండెంట్" అని గురువు చెప్పారు.

# ఆసియాలో చారిత్రక నగరాలు

షేక్ అబ్దుల్ హాకీం జాని



## సమర్ఖండ్

సమర్ఖండ్ ఆగ్నేయ ఉజ్బెకిస్తాన్‌లోని నగరం. మధ్య ఆసియాలో నిరంతరాయంగా మానవ ఆవాసముంటూ ఉన్న పురాతన నగరాలలో ఒకటి. దీనిని సమర్ఖండ్ అని కూడా పిలుస్తారు. తైమూరిడ్ సామ్రాజ్య స్థాపకుడు, పాలకుడైన తైమూర్(తామర్లేన్) 1370 నుండి 1405 మధ్య కాలంలో ఆసియాలో సగ భాగాన్ని పరిపాలించినట్లు చరిత్ర చెబుతోంది. ఆ కాలంలో సమర్ఖండ్‌ను తమ రాజధానిగా చేసుకుని ఆసియా స్వర్గధామంగా మార్చాడు. ఈ ప్రాంతాన్ని 1333లో సందర్శించిన ఇబ్న్ బటుటా అనే చరిత్రకారుడు సమర్ఖండ్ అత్యున్నతమైన నగరాలలో ఒకటి అని పేర్కొన్నాడు. 2001లో యునెస్కోలో ఈ నగరాన్ని ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చింది. సమర్ఖండ్ ఎప్పుడు స్థాపించారనడానికి ప్రత్యక్ష సాక్ష్యం లేనప్పటికీ పురాతన శిలాయుగం చివరి నుండి నగర ప్రాంతంలో మానవ కార్యకలాపాలకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. ఇది క్రీస్తు పూర్వానికి చెందిన నగరంగా భావిస్తున్నారు. చైనా నుండి యూరప్‌కు సిల్క్ వస్త్రాలు చేరవేసే మార్గంలో ఉండటంతో వ్యాపార కూడలిగా మారి అభివృద్ధి చెందింది. ఈ నగర నివాసులలో ఎక్కువ మంది స్థానిక పర్షియన్ భాషను మాట్లాడతారు. తజిక్ పర్షియన్ మాండలికం కూడా మాట్లాడతారు. ఈ నగరం మధ్య ఆసియాలోని తజిక్ ప్రజల చారిత్రక కేంద్రాలలో ఒకటి. ఇది గతంలో ఇరాన్ సామ్రాజ్యాలలో ముఖ్యమైన నగరాలలో ఒకటిగా ఉండేది. ఈ నగరాన్ని క్రీ.పూ.329లో అలెగ్జాండర్ స్వాధీనం చేసుకున్నాడు. ఆ తరువాత క్రీ.శ.1220లో చెంఘిజ్ ఖాన్ నేతృత్వంలో మంగోలులు స్వాధీనం చేసుకునే వరకు ఈ నగరాన్ని ఇరాన్, టర్కీ పాలకులు పరిపాలించారు. సమర్ఖండ్ నగరం ఇస్లామిక్ పండితుల అధ్యయనానికి కేంద్రంగా భాసిల్లింది. అనంతరం తైమూర్ దీన్ని ఆక్రమించుకుని గుర్-ఏ-అమీర్ పేరుతో ఒక రాజగోపురాన్ని నిర్మించాడు. తరవాతి కాలంలో దీన్నే అతని ప్రార్థనా మందిరంగా మార్చాడు.

ఆగ్రాలో తాజ్‌మహల్, ఢిల్లీలో హుమయున్ సమాధిలా సమర్ఖండ్‌వారు పర్షియన్ భాషలో గుర్-ఏ-అమీర్ అని పిలిచే దానికి రాజసమాధి అని అర్థం. నీలిరంగు గమ్ముటాలతో పరమాద్భుతమైన డిజైన్లతో అందరినీ ఆకర్షించే ఈ కట్టడంలో తైమూరు కుమారులైన షారూఖ్, మీరాన్ షా, మనుమలైన ఉలుగ్ బేగ్, మహమ్మద్ సుల్తానుల సమాధులు కూడా ఉన్నాయి.

తైమూర్ గురువైన సయ్యద్ బరాకాను కూడా ఇక్కడే ఖననం చేసి గౌరవ స్థానం కల్పించారు. ఇక్కడే బీబీ ఖానిమ్ ఫ్రైడే మసీదును నిర్మించారు. నిర్మాణ పరంగా ఇది మహోన్నత కట్టడం. దీన్ని 1399-1404 మధ్య కాలంలో నిర్మించినట్లు తెలుస్తోంది. తైమూర్ అత్తగారైన బీబీ చిన్యమ్ మరణించిన అనంతరం ఆమెను తైమూర్ ఇక్కడే సమాధి చేయించాడు. ఈ సమాధి ఉన్న భవనరాజాన్ని తయారు చేయడానికి నాలుగు సంవత్సరాల కాలం పట్టింది. 500 మంది కూలీలు రాళ్లను చెక్కి దీన్ని నిర్మించారు. ఈ పనిలో 90 ఏనుగులను కూడా ఉపయోగించారు. వందలాది స్తంభాలు, వందలాది గోపురాలతో దీన్ని నిర్మించారు. ప్రధాన గోపురం 15 మీటర్ల వ్యాసం, 12.5 మీటర్ల ఎత్తును కలిగి వుంది. దీని ద్వారాలు పలు రకాల ఖనిజాలతో నిర్మించారు. నగరం మధ్యలో ఉన్న ఇళ్లను ఖాళీ చేయించి వ్యాపారస్తుల కోసం అతిపెద్ద రహదారిని నిర్మించారు. ఇప్పుడు ఇది ఆసియా-యూరప్ ఖండాలను కలిపే కేంద్ర స్థానమై గొప్ప వ్యాపార కేంద్రంగా విరాజిల్లుతోంది. ఆసియా స్వర్గధామంగా విరాజిల్లుతున్న ఈ భవన సముదాయాలను 14వ శతాబ్దం చివరిలో మహమ్మద్ సుల్తాన్ ఆదేశాల మేరకు నిర్మించారు. మొహమ్మద్ ఇబిన్ మహమూద్ అనే వాస్తుశిల్పి ఈ గుమ్మటానికి ముందు 12 మీటర్ల ఎత్తయిన ద్వారాన్ని నిర్మించాడు. ఎత్తయిన మీనారులు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. ద్వారం ఎంతో సుందరగా కళ్లు జిగేల్ అనే అద్భుతమైన రంగులు, డిజైన్లతో తీర్చిదిద్దారు. సభా మందిరానికి పక్కనే మసీదులు, ఉలుగ్‌బేగ్, షేర్-దోర్, తిల్యకోరి పేర్ల మూడు మదర్సాలు కూడా నిర్మించారు. క్రీ.శ.1405లో ఈ భవన సముదాయం నిర్మాణం పూర్తి అయిన పిదప తైమూర్ మరణించిన అనంతరం ఇక్కడే సమాధి చేశారు.

సమర్ఖండ్‌లోని రిజిస్తాన్ స్క్వేర్ నగరం పురాతన కేంద్రంగా భాసిల్లుతోంది. ఇక్కడ మూడు మత పరమైన స్మారక భవనాలు ఉన్నాయి. ఎంబ్రాయిడరీ, బంగారు పని, పట్టు నేత, రాగి చెక్కడం, సిరామిక్స్, చెక్క చెక్కడం, చెక్క పెయింటింగ్ వంటి పురాతన హస్తకళల సంప్రదాయాలను నగరం జాగ్రత్తగా సంరక్షించుకుంది. ఆధునిక సమర్ఖండ్‌లో పాత నగరం, కొత్త నగరం అనే రెండు విభాగాలు వున్నాయి. కొత్త నగరం రష్యన్ సామ్రాజ్యం, సోవియట్ యూనియన్‌ల కాలంలో అభివృద్ధి చెందింది. పాత నగరంలో చారిత్రక కట్టడాలు, దుకాణాలు పాత ప్రైవేట్ గృహాలు ఉన్నాయి. కొత్త నగరంలో సాంస్కృతిక కేంద్రాలు, విద్యా సంస్థలతో పాటు పరిపాలనా భవనాలు ఉన్నాయి.


## నిషేధించబడిన నగరం

ఇది చైనా రాజధాని బీజింగ్, ఇంపీరియల్ సిటీ మధ్యలో ఉన్న డాంగ్‌చెంగ్ జిల్లాలోని ఒక రాజభవన సముదాయం. దీన్ని ఫర్బిడెన్ సిటీ అని పిలుస్తారు. ఈ రాజభవన సముదాయాన్ని 1987లో యునెస్కోవారు ప్రపంచ వారసత్వ ప్రదేశాల జాబితాలో చేర్చారు. దీన్ని 1406 నుండి 1420 మధ్య కాలంలో నిర్మించారు. ఆ తరువాత 1420 నుండి 1924 మధ్య కాలంలో మింగ్ రాజవంశం నుండి క్వింగ్ రాజవంశం వరకు చైనా చక్రవర్తులకు శీతాకాల నివాసంగా విరాజిల్లింది. దాదాపు 500 సంవత్సరాలకు పైగా చైనా ప్రభుత్వ ఆచార, రాజకీయ కేంద్రంగా భాసిల్లింది. దాదాపు 10 లక్షల మంది బానిసలు 72 హెక్టార్ల స్థలంలో ఈ రాజ భవనాన్ని నిర్మించడానికి నిరంతరం శ్రమించారు. రాజకుటుంబీకులు మాత్రమే ఇందులో నివసించేవారు. ఒక సందర్భంలో ఇది అగ్నికి ఆహుతై చాలా వరకు దెబ్బతిన్నది. 18వ శతాబ్దంలో దీన్ని పునర్నిర్మించిన పిదప ఈ రాజభవనం నిషేధించబడిన నగరంగా ప్రకటించారు.

మావో విజయానికి ముందు 24 మంది చక్రవర్తులు ఈ రాజభవనంలో నివసించారు. 35 మీటర్ల ఎత్తులో ఉన్న దీని పైకప్పు 24 స్తంభాలపై ఆధారపడి ఉంటుంది. మందిరం మధ్య భాగంలో చందనంతో తయారు చేసిన చక్రవర్తి సింహాసనం ఏర్పాటు చేశారు. మధ్య యుగపు చక్రవర్తులు దీన్ని ధ్యాన మందిరంగా, విశ్రాంతి మందిరంగా కూడా ఉపయోగించేవారు. ఈ రాజ భవనంలో తొమ్మిది వేల గదులున్నాయి.

## రాచరిక నగరం 'క్యోటో'

కొరియా నుండి జపాన్ వలస వచ్చిన కొందరు క్రీ.శ.794లో జపనీయుల చక్రవర్తి కన్ము పాలనా కాలంలో ఈ నూతన నగరాన్ని స్థాపించారు. తొలుత ఈ నగరాన్ని హియాంకియో అని పిలిచేవారు. ఆ తరువాత సాంస్కృతిక, మత కేంద్రమైన ఈ నగరాన్ని క్యోటో అని పిలవబడం ప్రారంభించారు. క్యోటో ఆధునిక మునిసిపాలిటీ 1889లో స్థాపించారు. ఇది జపాన్‌లోని పురాతన మునిసిపాలిటీలలో ఒకటి, రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో నగరం పెద్ద ఎత్తున విధ్వంసం నుండి తప్పించుకుని తత్ఫలితంగా యుద్ధానికి ముందు ఉన్న దాని సాంస్కృతిక వారసత్వాన్ని ఎక్కువగా



భద్రపరచుకోగలిగింది. మీజీ కాలం ప్రారంభంలో 1869లో క్యోటో నుండి టోక్యోకు చక్రవర్తి తరలిపోవడంతో క్యోటో ఆర్థిక వ్యవస్థను బలహీనపడింది. ఆధునిక నగరం క్యోటో 1989 ఏప్రిల్ 1న ఏర్పాటైంది. ఈ నగర పునరుద్ధరణలో భాగంగా 1890లో లేక్ బివా కెనాల్ నిర్మించారు. క్యోటో జపాన్ సాంస్కృతిక రాజధానిగా పరిగణిస్తారు. ఈ రాచరిక నగరం జపనీయుల కళలు, ఉద్యానవనాలు, మధ్యయుగ దేవాలయాలు, భవంతులతో నిండి వుంది. ఇది ఒక ప్రధాన పర్యాటక కేంద్రం. పురాతన నగరమైన క్యోటోలో 15 వందల బౌద్ధారామాలు ఉన్నాయని అంచనా. యునెస్కోవారు 1994లో ఈ ప్రదేశాన్ని వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు.

## పురాతన నగరం 'హ్యూ'

వియత్నాంలోని అన్నమహా సరిహద్దుల్లో నెలకొని ఉన్న పురాతన నగరం హ్యూ. హ్యూయాంగ్ జియంగ్ నదీ తీరాన ఇది నెలకొని ఉంది. హ్యూ వియత్నాం పురాతన సామ్రాజ్య రాజధాని నగరం. ఇది వియత్నాం రిపబ్లిక్‌లో మూడవ అతిపెద్ద నగరంగా మారింది. దీనిని దక్షిణ వియత్నాం అని పిలుస్తారు. 17వ శతాబ్దంలో హ్యూ అనే అతను ఈ నగరాన్ని నిర్మించాడు. 1802 నుండి 1945 వరకు గుయాన్ వియాత్నామీస్ చరిత్రలో చివరి వంశమైన గుయాన్ పాలకుల చేతిలోకి వచ్చింది. ఆలయాలు, ఉద్యానవనాలు, భవంతులు, విశ్రాంతి ప్రదేశాలు మొదలైనవి కలిగి వుండటం ఈ నగర విశిష్టత. ఇక్కడి శ్మశాన వాటికలోని సమాధులను మందిరాలవలె కళాత్మకంగా నిర్మించడం విశేషం. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ వియత్నాంలు కలిసిపోయి ఒకే వియత్నాంగా ఏర్పడి, కమ్యూనిస్టు పార్టీ పాలనలో ఉంది. హోచిమన్ నగరం దీనికి రాజధాని. హ్యూ నగరంలోని పురాతన కట్టడాల సముదాయాన్ని యునెస్కోవారు 1993లో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రకటించారు.

## పగోడాలకు నిలయం 'బగాన్'

దక్షిణ ఆసియా మయన్మార్‌లోని ఒక పురాతన నగరం బగాన్. ఇది 11 నుండి 13వ శతాబ్దాల మధ్య కాలంలో ప్రాంతీయ సామ్రాజ్యానికి రాజధానిగా ఉండేది. ఆ కాలంలో నిర్మించిన పురాతన బౌద్ధ ఆలయాలు, స్మారక నిర్మాణాలు, స్థూపాలు, కట్టడాలు, ఆలయాలు బగాన్‌లో ఉన్నాయి. దాదాపు మూడు వేల బౌద్ధ పగోడాలతో చారిత్రక నగరంగా విరాజిల్లుతోంది.

ఈ నగరంలో అతి పెద్ద బౌద్ధాలయం థర్ద్ యాన్ గ్విపహ్తో. దీనిని 12వ శతాబ్దంలో కలగ్వమిన్ కాలంలో నిర్మించారు. ఈ నిర్మాణాన్ని అనవర్త రాజు ప్రారంభించగా అతని కుమారుడైన క్యన్‌జిత్తా కాలంలో పూర్తి చేశారు. ప్రస్తుతం ఇది మయన్మార్ జాతీయ చిహ్నంగా విరాజిల్లుతోంది. యునెస్కోవారు 2019 జులై 6వ తేదీన బగాన్‌ను ప్రపంచ వారసత్వ ప్రదేశంగా అధికారికంగా ప్రకటించారు.



## సింగిల్ పేజీ కథ

# జ్ఞాపకం

ఓట్ర ప్రకాష్ రావు

మా ఆవిడ చెప్పిన జాబితా ప్రకారం కాయగూరలు కొన్నాక మరొక్కసారి ఇంకా ఏమి చెప్పిందని ఆలోచించాను. చెప్పినవన్నీ కొన్నానన్న నమ్మకం కలగగానే మార్కెట్ దాటి బయటకు వస్తున్నప్పుడు ఫోన్ రింగ్ అయింది.. మా ఆవిడ దగ్గర నుండి ఫోను.

“మార్కెట్ బయట గాంధీ విగ్రహం దగ్గరున్న ముసలావిడ దగ్గర పువ్వులు కొనండి. ఆమె దగ్గర ఎవరెళ్లినా న్యాయమైన ధరకే అమ్ముతుంది. బేరం చేసే పని వుండదు” అంది.

పువ్వులు కావాలని చెప్పిన సంగతి అప్పుడు గుర్తుకు వచ్చింది.

గాంధీ విగ్రహం కింద కూర్చొన్న ముసలావిడ దగ్గరకెళ్లి నేనడిగిన పువ్వులు న్యూస్ పేపర్లో ఉంచి పొట్లం కడుతుంటే “ఏంటమ్మా, ఇంకా పొట్లం కడుతున్నావు. ప్లాస్టిక్ సంచులలో వేసివ్వకూడదూ” అన్నాను.



“సారూ, గాంధీ విగ్రహం ముందు కూర్చొని భూదేవికి హాని కలిగించే ప్లాస్టిక్ సంచులు వాడడం న్యాయం కాదండీ!” అంది.

ఆ మాటలు నాకు నవ్వు తెప్పించాయి. “నీవు ప్లాస్టిక్ సంచి వాడనందువలన ఆ గాంధీ నీకు ఏమైనా సాయం చేశాడా?”

“మాటలలో చెప్పలేనంత సాయం చేసాడు సారూ”

“ఎలాగా?” ఆశ్చర్యంతో ప్రశ్నించాను.

“గాంధీబొమ్మ చుట్టూ వ్యాపారాలు పెట్టకూడదని పట్టణ అధికారులు అందరిని తరుముతున్నప్పుడు “అయ్యా, నేను ముసలిదాన్ని, గాంధీ అంటే నాకు చాలా ఇష్టం. నేను గాంధీ బొమ్మ కింద కూర్చొని అన్యాయంగా వ్యాపారం చెయ్యడం లేదు. అలాగే భూమాతకు హాని కలిగించే ప్లాస్టిక్ సంచులు వాడటం లేదని చెప్పాను. ఆయన నాకు ఇక్కడ వ్యాపారం చెయ్యడానికి అనుమతించారు”.

మంచివారిని ఆదరించే గుణమున్న ఆ అధికారిని మనసులోనే మెచ్చుకొన్నాను.

పూలపొట్లం నా చేతికిస్తూ “ముప్పై రూపాయలు” అంది.

నేను జేబులో చేయి పెడితే అప్పుడు తెలిసింది.

“చూడమ్మా, ఐదు వందల రూపాయల నోటు మాత్రమే వుంది” ఇబ్బందిగా అన్నాను.

“నా దగ్గర చిల్లర లేదు సారూ, వున్న చిల్లరంతా ఇంతకు ముందే ఒకరికి ఇచ్చాను”.

“ఈ ఐదొందల రూపాయలు నీ దగ్గరే వుంచుకోమ్మా, మరోసారి ఇక్కడకు వచ్చినప్పుడు ముప్పై రూపాయలు ఇచ్చి ఈ ఐదొందల నోటు తీసుకెళ్తాను” అన్నాను.

“సారూ, మీ ముప్పై రూపాయల కోసం ఐదు వందల రూపాయలు తీసుకోవాలా? ఐదు వందల రూపాయలు మీ దగ్గరే వుంచుకోండి. రేపెప్పుడైనా ఇటుగా వచ్చినప్పుడు ఆ డబ్బులు ఇవ్వండి. దీనికోసం రావద్దండి” అంది.

“అది కాదమ్మా! నాకు ఈ మధ్య జ్ఞాపకశక్తి తగ్గింది. ముప్పై రూపాయలు అంటే చిన్న మొత్తం. ఐదు వందలు అయితే నాకు కొంతవరకు గుర్తుంటుంది”.

“సారూ, సంచిలో ఒక పేనా వేస్తాను. ఆ పేనా చూసినప్పుడు నా ముప్పై రూపాయల విషయం మీకు గుర్తుకు వస్తుంది” అంటూ తన ముందు అట్టపెట్టెలో వున్న పేనాలలో ఒకటి తీసి నా సంచిలో వేసింది.

ఇంటికి వెళ్లాక మా ఆవిడ చేతికి సంచి ఇచ్చాను.

“ఏమండీ! సంచిలో పేనా వుంది” అంటూ మా ఆవిడ చెప్పగానే ముప్పై రూపాయల సంగతి గుర్తుకు వచ్చి జరిగింది చెప్పిన తరువాత “మార్కెట్ వైపు వెళ్లేటప్పుడు గుర్తు చెయ్యి” అంటూ పేనా టేబులు మీద వుంచాను.

ఆ సాయంత్రం మార్కెట్ వైపు వెళ్తున్నప్పుడు మా ఆవిడ ఫోన్ చేసింది.

“ఏమండీ! మీ జేబులో ముప్పై రూపాయలు చిల్లరగా వుంచాను. ఆ పూలమ్మకు మర్చిపోకుండా ఇవ్వండి” అని చెప్పగానే జేబులో వున్న ముప్పై రూపాయలు చేతిలోకి తీసుకొని “ఇప్పుడే వెళ్లి ఇస్తాను” అంటూ ఆమె దగ్గరకు వెళ్లి ముప్పై రూపాయలు ఇవ్వగానే “మంచిది సారూ” అంది.

ఇంటికొచ్చాక టేబుల్ మీదున్న పేనా చూసి “అయ్యో, పేనా ఇవ్వడం మర్చిపోయాను” అనుకొంటూ ఆ పేనా తీసుకొని జేబులో వుంచుకొన్నాను. మరుసటి రోజు ఇంటి నుండి బయలుదేరుతున్నప్పుడు జేబులో పేనా చూడగానే గుర్తుకొచ్చింది. మార్కెట్ దగ్గర ఆమెను చూడగానే పేనా తీసి ఆమె చేతికిస్తూ “నిన్న పేనా తీసుకొని రావడం మర్చిపోయాను” అన్నాను.

“దీనికోసం అంత శ్రమ పడి ఎందుకు వచ్చారు సారూ” అంది. “మీ పేనా మీకు ఇవ్వడం నా బాధ్యత” అన్నాను.

“సారూ, అది రాయని పేనా, మా ఇంటి దగ్గరున్న బడి ముందు పాత పెనాలు పడి ఉంటే తీసి వుంచుతాను. నా డబ్బులు ఇవ్వడానికి జ్ఞాపకం రావడం కోసం ఇలా పేనా ఇస్తాను” అంటూ తన ముందు పేనాలున్న అట్టపెట్టెలో వేసింది నేనిచ్చిన పేనాను.

అట్టపెట్టెలో వున్న రాయని పెనాలన్నీ నా వైపు చూసి వెక్కిరిస్తూ నవ్వుతున్నట్లు అనిపించింది.



# వారఫలం

శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్: 9849453449, 9440927795

## మేషం



జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఎంతటి కార్యాన్నైనా పట్టుదలతో సాధిస్తారు. సన్నిహితుల నుండి శుభవార్తలు వింటారు. చిన్ననాటి మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. రాజకీయ, పారిశ్రామిక రంగాలలోనివారు ప్రభుత్వ పరంగా ఆహ్వానాలు అందుకుంటారు.

## వృషభం



నూతన పరిచయస్తులతో మిత్రత్వం ఏర్పరచుకుంటారు. మాటకారితనంతో మీ పనులను సానుకూల పరచుకుంటారు. మీరు చేసే ప్రతి పనీ వివేకంతో కూడివుంటుంది. ఆర్థికంగా లోటు ఉండదు. అనేక విషయాలలో సంయమనం పాటిస్తారు. ఇతరుల వత్తిడికి తలొగ్గి మీకు ఇష్టం లేని ఒక పని చేయాల్సి వస్తుంది. ఉద్యోగంలో మీ స్థానం పదిలమవుతుంది.

## మిథునం



తల్లిదండ్రుల పట్ల, సహోదరీ వర్గం పట్ల ప్రేమ కలిగి ఉంటారు. బాధ్యతల నిర్వహణలో వెనకడుగు వేయరు. మీ మాటలను, అభిప్రాయాలను స్పష్టంగా తెలియ జేస్తారు. వివాదాస్పద అంశాలను ప్రాథమిక దశలోనే సర్దుబాటు చేసుకుంటారు. మీకు రావాల్సిన బిల్స్, క్లెమ్స్ సకాలంలో చేతి కందుతాయి. సాహసోపేతమైన పనుల పట్ల ఆకర్షితులవుతారు.

## కర్కాటం



వ్యాపార సంస్థలలోని వారికి అనుకూలం. ఉద్యోగస్తులు ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించడం మంచిది. ఇతరులతో మాట్లాడవలసి వచ్చినప్పుడు స్వయంగా భావాలను వారికి చెప్పండి. రాయ బారాలు నడపకండి. మీ మాటలకు వక్రభాష్యాలు చెప్పేవారు ఎక్కువగా వుంటారు కనుక జాగ్రత్తలు పాటించండి.

## సింహం



వ్యాపార పరంగా లాభాలు చేతికంది వస్తాయి. చెల్లింపులను సకాలంలో చెల్లిస్తారు. పనిభావం వలన సమయం సరిపోదు. సంతాన విద్యా అవసరాలకు గాను పుస్తకాలు/తత్సంబంధమైన వాటిని కొనుగోలు చేస్తారు. మీ ఆలోచనలు ఈ వారం కొంతవరకు కార్యరూపం సంతరించుకుం టాయి. వ్యక్తిగత అభివృద్ధి కోసం ఎక్కువగా శ్రమిస్తారు.

## కన్య



కుటుంబ పరిస్థితులపై దీర్ఘాలోచనలు సాగిస్తారు. ఆర్థికంగా సర్దుబాట్లు చేయడం శక్తికి మించిన పని అవుతుంది. తక్కువ శ్రమతో మంచి ఫలితాలు సాధిస్తారు. మనసు పరిపరి విధాలుగా ఆలోచిస్తుంటుంది, ఈ ఆలోచనలకు మాత్రం తెరపడదు. ఉద్యోగస్తులకు చెప్పుకోదగిన మార్పులేవీ ఉండవు. వ్యాపారంలో మరిన్ని లాభాలు కోసం ప్రయత్నిస్తారు.

## తుల



ఆర్థిక పరమైన విషయాలలో కచ్చితంగా వ్యవహరిస్తారు. నిర్మొహమాటమైన మీ వైఖరి వల్ల ఎదుటివారి మనస్సు నొచ్చుకుంటుంది. టెండర్లు, జాబ్ వర్కులు, ఎగుమతి ఆర్డర్లు అనుకూలిస్తాయి. సమాచార సంబంధిత విషయాలను ఇతరులకు అప్పజెప్పనంతవరకు ఎటువంటి ఇబ్బంది ఏర్పడదు. చెక్కులు తీసుకునేటప్పుడు జాగ్రత్తలు వహించండి. అవి బౌన్స్ అయ్యేందుకు అవకాశాలున్నాయి.

## వృశ్చికం



కార్యాలయాలలో అధికంగా శ్రమిస్తారు. మనలో తప్పు లేకపోతే ఎవరికీ తల వంచనవసరం ఉండదని భావిస్తారు. ప్రతికూల పరిస్థితులు వున్నప్పటికీ ధైర్యంగా ఉంటారు. కోర్టును ఆశ్రయించవలసిన పరిస్థితులు ఎదురవు తాయి. ఉన్నత స్థానంలోనివారు మీ పట్ల అన్యాయంగా ప్రవర్తిస్తున్నారని భావిస్తారు. అపోహలు పెనుదుమారం లేపుతాయి. అందువల్ల ఈ విషయంలో జాగ్రత్తలు వహించండి.

## ధనుస్సు



అన్ని రంగాల్లోనివారు ఎంతో కొంత లబ్ధి పొందు తారు. సాంప్రదాయ కార్యక్రమాలను నిర్వహించడంలో ప్రత్యేకతను కనబరుస్తారు. పెద్దరికాన్ని కలిగి వుంటారు. ప్రత్యర్థుల వ్యూహాలను తిప్పికొట్టగలుగుతారు. ప్రయాణాలు, సమాలోచనలు, శుభ కార్య నిర్వహణ మొదలైన వ్యవహారాలను అనుకున్న విధంగా నిర్వహిస్తారు. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. పనులు పూర్తి అయ్యేంతవరకు మీ మాటను బయటకు పొక్కనివ్వకండి.

## మకరం



ముఖ్యమైన పనులు సానుకూల పడతాయి. ఒకరికిచ్చిన మాటను నిలబెట్టుకుంటారు. రుణాలను కొంతవరకు తీరుస్తారు. ఉన్నత విద్యా, ఉద్యోగ వ్యవహారాలు ఓ కొలిక్కి వస్తాయి. కోర్టుకేసులు వాయిదాలలో ఉంటాయి. మనస్సుకు సంతోషం కలిగించే విధంగా ఓ సంఘటన చోటు చేసుకుంటుంది. సెంటిమెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే నిర్ణయాలు తీసుకుంటారు.

## కుంభం



నూతన వ్యాపారాలు ప్రారంభిస్తారు. భాగస్వాములు, సన్నిహితులు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తారు. విద్యా, సాహిత్య, కళా రంగాల్లోని వారికి అనుకూలం. తక్కువ కాలంలో సాగే తాత్కాలిక వ్యాపారాలు లాభాల బాటలో ఉంటాయి. కీర్తి ప్రతిష్టలు పెంపొందుతాయి. నిర్మాణాత్మక కార్యక్రమాల్లో పురోభివృద్ధి గోచరిస్తోంది.

## మీనం



ఉపకరించే అంశాలు ఎక్కువగా ఉన్నాయి. నూతన వస్తు, వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. బంధుత్వాలు మరింత బలపడతాయి. వృత్తి, ఉద్యోగాల పరంగా అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉంటాయి. మీ అభిరుచికి తగిన విధంగా గృహం కొనుగోలు చేస్తారు. ప్రయాణాల వల్ల అలసిపోతారు. రాజకీయ రంగాల్లోని వారికి అనుకూలం. ప్రింట్, ఎలాక్ట్రానిక్ మీడియా వల్ల లాభపడతారు.

# నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉండవచ్చా?


**వాస్తువార్త**



వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్

సెల్స్: 9885446501/9885449458


## పశ్చిమంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-అనుకూలం

ఇంటి ఆవరణలో పశ్చిమంలో బావి చెడు ఫలితాలనిస్తుంది. కానీ ఇంటి కప్పు మీద పశ్చిమంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ సత్ఫలితాలనిస్తుంది. భారం వుండవలసిన పశ్చిమంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ వాస్తు అనుకూలతలకు దారితీస్తుంది.

**శుభా శుభ ఫలితాలు:** వ్యాపార వ్యవహారాలలో అనుకూలత, ధన ధాన్యాభివృద్ధి.

### West Overhead tank-Favourable

A well towards West gives unfavou rable results. But an overhead tank towards West on the terrace gives favourable results.



**Likely Result:** Business dealings are favoured, financial prosperity.

## పశ్చిమ నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్-అతి అనుకూలం

ఇంటికి పశ్చిమ నైరుతిలో బావి అతి ప్రతికూలం. కానీ పై కప్పు మీద పశ్చిమ నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్ భారమై వాస్తుకు అతి అనుకూలమైనది అవుతుంది.

**శుభా శుభ ఫలితాలు:** వ్యవహార దక్షత, అభివృద్ధికి బాటలు.

### West South-West Overhead tank-most Favourable

A well towards West South-West gives unfavourable results. But an overhead tank towards West South-West on the terrace gives most favourable results.

**Likely Result:** Business dealings are favoured, development in all aspects.

## నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్-మధ్యమ ఫలితాలు

పూర్తి నైరుతి మూలలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం, నైఋతి మూల పోటు వలన అంతా అనుకూల ఫలితాలనివ్వకపోవచ్చు. కానీ చెడు ఫలితాలను మాత్రం ఇవ్వదు. వాస్తు ప్రయోజనాలను ఎక్కువగా ఆశిస్తుంటే ఈ మూల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం వార్ఛణీయం కాదు.

**శుభా శుభ ఫలితాలు:** మధ్యమ ఫలితాలు.

### South-West overhead tank-mixed

An overhead tank com-pletely towards South-West does not give any favourable or unfavourable results. In view of vaasthu and for good results it is better to avoid overhead tank towards South-West.

**Likely Result:** Mixed.

## దక్షిణ నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్-అనుకూలం

ఇంటికి దక్షిణ నైరుతిలో బావులు చాలా చెడు ఫలితాలనిస్తాయి. కానీ పై కప్పు మీద దక్షిణ నైరుతిలో ఓవర్‌హెడ్ ట్యాంక్స్ సత్ఫలితాలనిస్తాయి. పైకప్పు, బరువు వుండవలసిన ఈ స్థానంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం వాస్తు అనుకూలతలను తెస్తుంది. **శుభా శుభ ఫలితాలు:** అధికార స్థిరత్వం, ఆరోగ్యం.

### South South-West Overhead tank-Favourable

A well towards South South-West gives unfavourable results. But an overhead tank towards South South-West gives favourable results. **Likely Result:** Good health, stability in all aspects.

## దక్షిణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-అనుకూలం

ఇంటికి దక్షిణంలో బావి అశుభం కాగా, ఇంటికి పైన దక్షిణంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ శుభ ఫలితాల నిస్తుంది. పైకప్పులు, బరువులు వుండవలసిన దక్షిణ స్థానంలోఓవర్‌హెడ్ ట్యాంక్స్ నిర్మాణం వలన అనుకూలత ఏర్పడుతుంది. **శుభా శుభ ఫలితాలు:** ఆరోగ్యం, స్థిరత్వం, ఆర్థికాభివృద్ధి.

### South overhead tank-Favourable

A well towards South is unfavourable. An overhead tank towards South gives favourable results. **Likely Result:** Good health, prosperity.

## దక్షిణ ఆగ్నేయంలో ఓవర్‌హెడ్ ట్యాంక్-మిశ్రమం


దక్షిణ ఆగ్నేయం 'ఆగ్నేయం'లో ఒక భాగం. ఆగ్నేయం అగ్నికి అనుకూలం అయినప్పుడు, నీటికి ప్రతికూలం అవుతుంది. అందుకని ఈ దిక్కున ఓవర్‌హెడ్ ట్యాంక్స్ ప్రతికూల ఫలితాలనే ఇవ్వాలి. కానీ దక్షిణ భారం అనుకూలం కనుక ప్రతికూల ఫలితాలు తీవ్రతరం కావు. **శుభా శుభ ఫలితాలు:** ధన నష్టం, అభద్రతా భావం.

### South South-East overhead tank-Mixed

South-East is a part of South South-East. South-East favours fire(Agni) and unfavours water(Jala). An overhead tank towards South-East gives unfavourable results but the weight of overhead tank changes into favourable results. **Likely Result:** Insecurity, monetary loss.

# పదరంగం-13

కూర్పు: పోపూరి విశ్వనాథ్



## ఆధారాలు

### అడ్డం

1. చాలా హడావిడిగా (6)
4. దీనికంటే వడ్డీ తీపిట (3)
6. కోపం (2)
8. కనుమరుగైన ఒక పెద్ద జంతువు (5)
10. శృతితోటిది (2)
11. హంపిలోని.... దేవాలయం ప్రముఖమైనది (4)
14. వావును చూసి .... అనుకోకూడదని సామెత (3)
16. నిలవ ఉండే పచ్చడి (4)
17. ఇంటిగుట్టు .... అని సామెత (5)
18. ఈ మధ్య హైదరాబాదులో మొదలైన ఒక పెద్ద 'మాల్' (2)
20. నిద్రలోని చప్పుడు సరిగా లేదు (3)
22. ఆదాయం, వచ్చేది (3)
24. మంచి (2)
25. సువాసనగల పిల్లి అటు నుంచి వచ్చింది (5)
26. మనసులోనిది (4)

### నిలువు

1. దీనితో చాకులు మొదలైనవి పదును పెడతారు (4)
2. తుది లేని పెద్దల సభ (3)
3. ఆగమనం (2)
5. చాలా ఎక్కువ సంఖ్య అయితే ఇలా అనడం రివాజు (4)
7. పైకొచ్చిన అందమైన మనిషి (3)
9. పూర్తి బాహాటం (5)
11. విస్తారం (3)
12. చదివేవారు (4)
13. అనాయాసం, అతితేలిక (2)
15. నానబోసి, వేయించి, దంచిన వడ్లు (4)
16. రంగులు మార్చేది (5)
19. నదులకు 12 ఏళ్లకు వచ్చేవి పైకొచ్చాయి (4)
21. తెలంగాణా మాండలికంలో గొణుగు (3)
23. తలకిందులైన కొట్లు (3)
24. సమ్మక్క, సారలమ్మ జాతర జరిగే ప్రాంతం (3)

## పదరంగం-11 జవాబులు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| లో 1 | కు | వ 2 | | కా 3 | | తి 4 | క | మ 5 | క |
| పా | | దం 6 | డ | యా | త్ర | | | న్మ | |
| య 7 | యా | తి | | పం | | శ్రీ 8 | నా | ధు | డు |
| కా | | | ఎం 9 | డా | కా | లం | | డు | |
| రి 10 | కి 11 | రి | కి | | | క 12 | ల్లు 13 | | ప 14 |
| | చ | | | ది 15 | శ 16 | | గ 17 | జ్జె | లు |
| ఆ 18 | లా | ప | న 19 | | త 20 | యా | రు | | గు |
| | ట | | య 21 | గా | మా | | ఓ 22 | నం 23 | |
| లో 24 | కం | | గా | | నం 25 | గి 26 | | ఆ | |
| పం | | గో 27 | రం | త | | ట్టు 28 | ర | స | పె |

## పదరంగం-11కు సరైన జవాబులు పంపించినవారు

1. యం.వి.రమణకుమారి–హైదరాబాద్
2. కె.ఎస్.ప్రకాశ్ – నిడదవోలు


జవాబులు పంపించాల్సిన చిరునామా:


**పదరంగం** ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.

పేరు : ..............................

..............................

ఊరు : ..............................



అమ్మ ఓనరు క్యాస్ట్ వేరు.. నాన్న ఓనరు క్యాస్టు వేరు.. మరి నాకే క్యాస్ట్ వస్తుంది స్వామీ?!


దేశ బంధు
'A' ఫాం ఎవడికిచ్చారో మర్యాదగా చెప్పండి!!
'B' FORM
పార్టీ ఆఫీసు


ఏంటే? లక్ష్మి బాబాయి కూడా తన కాబుస్తుందా?!

ఈ వారం కా‘ర్టూన్స్’

ఫోటో ఫీచర్



భూగర్భంలో వుండే ఈ థీమ్ పార్కు రుమేనియాలోని టుర్డాలో ఉంది. ఒకప్పుడు ఈ ప్రాంతం అత్యంత పురాతనమైన ఉప్పుగనుల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందింది. ఉప్పునిల్వలు అంతరించిపోయాక ఈ ప్రాంతాన్ని థీమ్ పార్కుగా అభివృద్ధి చేశారు. కాలక్రమంలో ఈ థీమ్ పార్కు పర్యాటక ప్రాంతంగా మారింది.









